ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : **సద్గురు శ్రీ నాన్నగారు**

సంపుటి : 11 సంచిక : 12 ఆగష్టు 2006

# అర్థనారీశ్వర తత్త్వం

దైవత్వంలో స్త్రీ పురుషులు ఇద్దరూ చెరి సగమని మన ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. ఏ ఒక్కరు లేకపోయినా అసంపూర్ణమే. మన పురాణాలలో కూడా స్త్రీ, పురుష సమభావం ఆధ్యాత్మికపరంగా వివరించబడింది. ఇందులకు త్రిమూర్తులే నిదర్శనం. శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవికి తన హృదయాన్నే నివాసస్థానంగా సమర్పించాడు. భార్యకు హృదయంలో సముచిత స్థానం ఇచ్చి గౌరవించే భర్త ఉత్తమ లక్షణాలతో విలసిల్లుతూ, సద్గుణాలకు కాణాచి అవుతాడు. అలా కాని వాడు మనశ్శాంతిని కోల్పోయి జీవితంలో ప్రగతిని సాధించలేని వాడవుతాడు. బ్రహ్మదేవుడు శారదామాతకు తన నాలుకపై స్థాన మిచ్చాడు. భార్య మాటకు భర్త తగిన విలువ నివ్వాలని దీని భావం. తన శరీరంలో సగభాగాన్ని మహేశ్వరి పరం చేసాడు పరమేశ్వరుడు. భౌతిక జీవితంలోనే కాకుండా ఆధ్యాత్మిక జీవనానికి కూడా పురుషునికి స్త్రీ సహచర్యం అవసరమని దీని అంతరార్థం. అప్పుడే మోక్షానికి మార్గం సులువుగా ఏర్పడుతుంది. శివశక్తి ఐఖ్యభావన ఇది ఋజువు చేస్తుంది. దంపతులు మనసా, వాచా, కర్మణా సమ భావంతో ప్రవర్తించినప్పుడే ఆధ్యాత్మికంగా మరియు సామాజికంగా కూడా అభివృద్ధిని సాధించి అందరికి ఆదర్శప్రాయు లవుతారు. ఇదే అర్థనారీశ్వర తత్త్వంలోని అసలు రహస్యం.

– బొప్పన అరుణాదేవి, హైదరాబాద్

**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(ఫైమ)

**చందా**
సంవత్సర చందా:రూ॥100/-
విడి ప్రతి : రూ॥ 5/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

గుమ్మలూరు ....... 17-05-06
పాలకొల్లు .......... 21-05-06
జిన్నూరు ............ 06-06-06
జిన్నూరు ............ 11-07-06

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 17-05-06, గుమ్మలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన శరీరం ద్వారా మనస్సు పనిచేస్తూ ఉంటుంది. నేను మంచివాడిని, నేను చెడ్డవాడిని, నేను గొప్పవాడిని ఇటువంటి తలంపులు అన్నీ ఎందుకు వస్తున్నాయి అంటే మనస్సే నేను అనుకోవటం వలన, మనస్సుతో తాదాత్మ్యం పొందటం వలన ఈ తలంపులు అన్నీ వస్తున్నాయి. మనస్సు నీవు కాదు కాని మనస్సే నేను అనే అలవాటు అనేకజన్మల నుండి వస్తోంది, ఇది నిజం కాదు, అది ఒక అలవాటు. జీవుడు కర్మ చేస్తాడు. ఆ కర్మ వాడిని వెంటాడుతున్నంతకాలం శరీరాలు వస్తూఉంటాయి. కర్మవాసనలు శరీరంలో ఉండవు, మనస్సులో ఉంటాయి. కర్మవాసనలలో నుండి జీవుడు బయటపడేవరకు శరీరాలు వస్తూనే ఉంటాయి. ప్రారబ్ధం ప్రకారం దేహయాత్ర జరుగుతూ ఉంటుంది. దేహం ద్వారా జరిగే సంఘటనలతో మనం తాదాత్మ్యం పొందకపోతే మనకు దుఃఖంరాదు, ఇది బాగా గుర్తుపెట్టుకోండి, సాధన అంటే ఇదే. బాహ్యంగా ఒకోసారి మనలను అదృష్టం వెంటాడుతూ ఉంటుంది, ఒకోసారి దురదృష్టం వెంటాడుతూ ఉంటుంది. అదృష్టంతోటి, దురదృష్టంతోటి తాదాత్మ్యం పొందము అనుకోండి, మనస్సును అలా ప్రాక్టీసు చేస్తాము అనుకోండి, కొత్త వాసనలు రావు, పాతవాసనలు అన్నీ రాలిపోతాయి. భగవంతుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. కాని మనలోపలఉన్న భగవంతుడిని చూడటం మనకు ఇష్టం లేదు. గుడిలో ఉన్న దేవుడిని చూడటం అంటే మనకు ఇష్టం ఎందుచేతనంటే గుడిలో ఉన్న దేవుడిని మనస్సు కల్పించింది. మనస్సు కల్పించిన విషయాలు అంటే మనకు ఇష్టం, కాని మనస్సు ఎంత నిజమో ఆ విషయాలు అన్నీ కూడా అంతే నిజం.

లోకంలో ఉన్న భక్తులలో సత్యాన్వేషకులు చాలా తక్కువమంది ఉంటారు. సత్యం మన హృదయంలోనే ఉంది. సత్యాన్ని తెలుసుకొనే వరకూ మనం బంధంలో నుండి, దుఃఖంలో నుండి, అశాంతిలో నుండి బయటపడలేము. ఇప్పుడు మీకు అన్ని విధాల బాగుంది అనుకోండి ఆ బాగు ఎప్పుడూ నిలబడదు, కాలప్రవాహంలో అన్నీ కొట్టుకొనిపోతాయి. అదృష్టం పోతుంది, దురదృష్టం పోతుంది కాని ఆ టైములో అది ఒక్కటే నిజం అని మనకు అనిపిస్తుంది. ఏ కాలంలో ఏది జరగాలో అది జరిగిపోతుంది, మరణం కూడా అంతే. శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే సర్వకారణములకు కారణమైనవాడే ఈశ్వరుడు అన్నారు. మీకు ఏదో దుఃఖం వస్తోంది అనుకోండి దానికి ఏదో కారణం ఉంటుంది. అందరి దుఃఖాలకు ఒకటే కారణం ఉండదు, రకరకాల కారణాల వలన దుఃఖం వస్తుంది. మీ దేహప్రారబ్ధంలో ఏది జరిగినా దానికి కారణం

ఉంటుంది. ఆ కారణం మన కళ్ళకు కనబడదు, చెవులకు వినబడదు. మీకు అశాంతి వస్తోంది అనుకోండి దానికి కారణం ఉంటుంది. ఇలా అనేక రకాల కారణాలు ఉంటాయి కాని ఈ కారణాలన్నింటికి ఒక కారణం ఉంది, వాడే ఈశ్వరుడు. సర్వ కారణములకు కారణమైనవాడే ఈశ్వరుడు, వాడికి తెలియకుండా మీకు ఏదీ రాదు, ఇది మీకు అర్థమవుతూ ఉంటే దుఃఖం నెమ్మదిగా నశిస్తుంది. చైతన్యం అంటే మహాసముద్రం లాంటిది. అది లోపల ఉంది, బయట ఉంది, అంతటా ఉంది. మన మనస్సు అనేది ఆ సముద్రంలో నుండి ఒక చెంచాతో నీరు తీసుకోవడం వంటిది. అది కూడా నీరే. కాని మనం దానిని సముద్రంలో కలపలేకపోతున్నాము, సెపరేట్‌గా ఉంచుకోవాలని చూస్తున్నాము. మన మనస్సు కూడా చైతన్యమే, అది సముద్రంలో బుడగలాంటిది. ఆ బుడగ పగిలిపోతే ఏమీ లేదు. ఆ బుడగ మనకు బంగారంలాగ కనిపిస్తోంది. అందుచేత దానిని విడిచిపెట్టలేక పోతున్నాము, అందుచేత మనలను దుఃఖం వెంటాడుతోంది. నామరూపములు అనేవి మబ్బులు. ఆకాశంలో మబ్బులు ఎక్కువగా ఉంటే సూర్యుడు ఎలాగ కనబడడో అలాగే మనం నామరూపములు అనే మబ్బులులో ఉంటే, వాటి చుట్టూ తిరుగుతూ ఉంటే కోటి జన్మలు ఎత్తినా లోపల ఉన్న వస్తువు మనకు దొరకదు, మీరు సాధనలు చేసినా దొరకదు. గానుగెద్దు చుట్టూరు తిరుగుతూ చాలా దూరం వచ్చేసాను అనుకొంటుంది కాని గంతలు విప్పేస్తే అక్కడే ఉంటుంది, మనం చేసే సాధనలు అలాగే ఉన్నాయి. సాధన చేసి వాసనలు తగ్గించుకోవాలి. సాధన చేసి వాసనలు పెంచుకొంటూ ఉంటే నీకు జ్ఞానం ఎలా కలుగుతుంది, ఆత్మసుఖాన్ని ఎలా పొందుతావు. ఆ పని నేను చేసాను, నువ్వు నన్ను గౌరవించాలి అంటారు. అసలు నువ్వు ఎవరు? నేను ఎవరు? అసలు నీకు ఆ పని చేసే శక్తి ఎవరు ఇచ్చారు. ఒకటి గుర్తు పెట్టుకోండి. మీలో ఎవరికయినా తెలివితేటలు ఉన్నాయి అనుకోండి, ధనం ఉంది అనుకోండి, అధికారం ఉంది అనుకోండి ఇవన్నీ భగవంతుడు యిస్తే మీకు వచ్చాయి కాని, ఇక్కడ మీ సొంతం అంటూ ఏమీ లేదు. భగవంతుడు ఇచ్చినవి మనం సొంతం అనుకొని మనం పాడైపోతున్నాము. భగవంతుడు మనకు ఇచ్చినదే, ఆయనకు ఇచ్చి నేను ఇచ్చాను అనుకొంటూ దేహవాసన పెంచుకొంటున్నాము. ఇంక ఈ జీవుడు దేహాన్ని అంటిపెట్టుకొని ఉంటాడు, కర్మవాసనలు దేహభావనను విడిచిపెట్టనివ్వవు. మనం చేసే కర్మ సత్కర్మ అయి ఉండాలి, అది నిష్కామంగా చేయాలి. కర్మ వాసనలు ఎలా తగ్గుతాయి అంటే మన దేహయాత్రకు సరిపడ పనులు మనం చేసుకొంటూ, మిగతా టైము కొంత స్వార్థం లేకుండా పనులు చేస్తూ ఉంటే నెమ్మదిగా కర్మ వాసనలు తగ్గటం ప్రారంభమవుతాయి. ఏదో గౌరవాలకోసం, స్వార్థం కోసం పనులు చేసి మేము నిష్కామకర్మ చేస్తున్నాము అంటే ప్రజలు నమ్ముతారు కాని దేవుడు

నమ్మడు. నీవు చేసే పనికి, నీవు మాట్లాడే మాటకు కూడా ఆయన సాక్షిగా ఉన్నాడు. అందుచేత మనుష్యయజ్ఞం చెయ్యి. అంటే నీ పొట్టకు సంబంధించినంత వరకు పని చూసుకొని, తోటి మానవులకు వారి అవసరాన్ని బట్టి కొంచెం కూడా స్వార్థం లేకుండా పని చెయ్యి. పని పనికోసమే చెయ్యి అంతేగాని గౌరవం కోసం చెయ్యవద్దు, అది మనుష్య యజ్ఞం. కొంత బ్రహ్మయజ్ఞం చెయ్యి. అంటే నీకు తెలిసిన మంచి మాటను ప్రక్కవాడికి చెప్పు. వాడు ఏదైనా అశాంతిగా ఉన్నాడు అనుకో, ఈ మాట చెపితే వాడికి కొంత శాంతి కలుగుతుంది అనుకో, స్వార్థం లేకుండా వాడికి మంచి మాటలు చెప్పు. పితృయజ్ఞం అంటే పితృదేవతల పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. మన పెద్దవారు ఎంతో కష్టపడితేనే మనం ఇంతటివారము అయ్యాము. వారు చదువు చెప్పిస్తే చదువుకొన్నాము, వారు కట్టిన ఇంటిలో ఉంటాము, వారు సంపాదించి ఇచ్చినది అనుభవిస్తూ ఉంటాము కాని వారిని గౌరవించటం లేదు, వారిని అగౌరవపరుస్తూ ఉంటాము. కనీసం సంవత్సరంలో ఒక్కరోజున అయినా వారు చనిపోయిన రోజు అయినా వారిని జ్ఞాపకం పెట్టుకోము. అందుచేత పితృదేవతలను మనం మర్చిపోకూడదు. మన జీవిత విధానం చెరువులో నీరు లాగ ఉండకూడదు, నదిలో నీరులాగ యజ్ఞభావనతో పనిచేస్తూ అలా ప్రవహిస్తూ ఉండాలి. 18 పురాణాలు వ్రాసిన వ్యాసుడు ఈ పురాణాల సారాన్ని రెండు మాటలలో చెపుతున్నాను అన్నాడు. నాకు ఏది మంచిది అని నేను అనుకొంటున్నానో అది ఇతరులకు కూడా మంచిదే, నాకు ఏది చెడ్డది అని నేను అనుకొంటున్నానో అది ఇతరులకు కూడా చెడ్డదే, ఇతరులు నా పట్ల ఎలా ప్రవర్తించాలని నేను అనుకొంటున్నానో నేను కూడా ఇతరుల పట్ల అలా ప్రవర్తించాలి అని చెప్పాడు. కొంతమంది మనుషులు ఎలా ఉంటారు అంటే అందరూ వారిని గౌరవించాలి అనుకొంటారు వారు మటుకు ఇతరులను అగౌరవంగా చూస్తారు, అది నీచాతి నీచమైన బుద్ధి. ఏ మనిషి అయినా వాడికి సొంత ఆలోచన లేకపోతే, వాడి మీద వాడికి విశ్వాసం లేకపోతే వాడు బాగుపడడు. వారు ఏమనుకొంటారు, వీరు ఏమనుకొంటారు అనుకోవటం వలన మీకు అజ్ఞానం పెరుగుతుంది. మీ పని ఏదో మీరు చేసుకోండి, మీ నిదానంలో మీరు ఉండండి. మీరు తరించటం చూసుకోండి. మీరు చనిపోయినప్పుడు మీ కుటుంబ సభ్యులుకాని, స్నేహితులుగాని ఒక్కడు కూడా మీ కూడా రాడు, ఈ జీవుడు ఒంటరి ప్రయాణం చెయ్యవలసి ఉంటుంది. ఇది గుర్తు పెట్టుకోండి.

కృష్ణుడు చివరి రోజులలో ఉద్ధవుడితో నేను నీకు చాలా విషయాలు చెప్పాను కాని సత్‌సాంగత్యం, మహాత్ములు, ఋషులు, యోగుల యొక్క కంపెనీకి మించిన సాధన లేదు ఉద్ధవా ఇంక మనం డిస్‌పర్స్ అయిపోదాము అన్నాడు కృష్ణుడు. ఒక గుడ్డివాడు ఇంకో గుడ్డివాడికి

దారి ఏమి చూపిస్తాడు. హృదయాభిముఖంగా ప్రయాణం చేసేవాడి దగ్గర, మహర్షుల దగ్గర ఉన్నప్పుడు వారి సహవాసం వలన వారి వైబ్రేషన్స్ నీమీద పనిచేస్తాయి. నీవు చేసే సాధన తక్కువ అయినా అత్యంత ఉత్కృష్టమైన ఉదాత్తమైన లాభాన్ని ఈ శరీరంలో ఉండగానే ఇప్పడే పొందుతావు, సత్‌పురుషుల సహవాసానికి మించిన సాధన లేదు ఉద్ధవా అంటాడు. ఏ వస్తువును తాను అనుభవిస్తున్నాడో, ఎంజాయ్ చేస్తున్నాడో వాడితో సహవాసం వలన వాడి వైబ్రేషన్స్ పనిచేసి నీకు తరించే మార్గం కనిపిస్తుంది ఉద్ధవా అంటాడు. రామకృష్ణ పరమహంస ఒక మాట చెప్పారు. ప్రతీ మనిషి నేను నేను అంటాడు. ఏదైతే నువ్వు నేను, నేను అంటున్నావో ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అన్నారు, ఎంత వండర్‌ఫుల్‌గా ఉందో చూడండి. ఆచార్యులవారు ఏమనిచెప్పారు అంటే నువ్వు చైతన్యాన్ని మనస్సు అనుకొంటున్నావు, చైతన్యాన్ని దేహం అనుకొంటున్నావు. నువ్వు తాడును పాము అనుకొంటున్నావు. నీవు పాము అనుకొన్నప్పడు కూడా అది తాడే. ఆ తాడే నీకు పాములాగ కనిపిస్తోంది. నీకు తాడు తాడులాగ కనిపించింది అనుకో అసలు పాము లేదు అన్న సంగతి నీకు తెలుస్తుంది. తాడు పాముగా కనిపించినంతకాలం నీకు భయం వేస్తుంది. తాడు తాడుగా కనిపించాక ఇంక భయకారణం ఉండదు, అయ్యో తెలియక పోవడంవలన భయపడ్డాను అనుకొంటావు. నువ్వు అనుభవించే దుఃఖం కూడా అటువంటిదే. ఇప్పడు మీరు ఏదైనా దుఃఖం అనుభవిస్తున్నారు అనుకోండి, మీకు జ్ఞానం కలిగింది అనుకోండి అనవసరంగా దుఃఖపడ్డాను, ఇంట్లో వారిని హింసపెట్టాను, నన్ను నేను హింసపెట్టుకొన్నాను అని నీకు అనిపిస్తుంది. మనం నేను నేను అంటాము, అసలు అది లేదు. బంగారం నీలోపలే ఉంది. ఆ బంగారం బంగారంలాగ నీకు కనిపించకపోవటం వలన ఈ నేను కనిపిస్తోంది. లోపల ఉన్న బంగారం బంగారంలాగ నీకు కనిపించినప్పడు అసలు ఈ నేనే లేదు. నీ సాధన అబద్ధం. ఇది ఉంది అనుకోవటం అబద్ధం, పోయింది అనుకోవటం అబద్ధం.

లోకం ఏదో రకంగా ప్రయాణం చేస్తుంది. నేను కూడా అలాగ వెళ్ళిపోతాను అంటే నీకు జ్ఞానం ఏమిటి? వారు అలా ఉంటున్నారు, వీరు ఇలా ఉంటున్నారు అని నీవు కూడా అలాగ ఉంటే నీకు జ్ఞానం ఏమిటి? నువ్వు నువ్వులాగ ఉంటే నీకు జ్ఞానం వస్తుంది కాని ఎవరిలాగో ఉంటే నీకు జ్ఞానం ఎలా వస్తుంది. నీకు రోగ నిర్ధారణ అయిన తరువాత దానికి సంబంధించిన మందులు వాడితే రోగం తగ్గిపోతుంది. అలాగే వాసనలు ఎలా తొలగించుకోవాలో తెలుసుకొన్నాక దానిని ప్రాక్టీసు చేయాలి అంతేగాని అదేపనిగా అధ్యయనం చేయనక్కరలేదు. దుఃఖకారణం కత్తిరింపబడకుండా దుఃఖం నశించదు. అది ఎలా

కత్తిరింపబడాలో నీకు శాస్త్రం చెపుతోంది, దానిని నీవు ప్రాక్టీసు చెయ్యటమే. నువ్వు వేరు, నేను వేరు అనే బేధబుద్ధి నశించే వరకూ ఏ మనిషినీ దుఃఖం విడిచిపెట్టదు. నేను ఉంటే నువ్వు ఉన్నావు, లోకం ఉంది. నేను లేదని నాకు తెలిసినప్పుడు నువ్వు లేవు, లోకం లేదు. ఎవడైనా మీ ఇంటికి సహాయం చేయమని వస్తాడు అనుకోండి, మీరు చేయగలిగితే చేయండి, లేకపోతే లేదు, అంతేగాని నీవు దున్నపోతులాగ ఉన్నావు, నీకు సహాయం ఏమిటి అని ఇటువంటి మాటలు అనవసరం. కొంతమంది మనుషులు పాడైపోవటానికి అనేక రకాల కారణాలు ఉంటాయి. అందుచేత మీకు ఇష్టమైతే చేయండి లేకపోతే పంపేయండి, తిట్టి పంపటం ఎందుకు? ఆ పరిస్థితులలో మనం ఉంటే మనం ఎలాగ ఉంటామో అని మనం ప్రశ్నించుకోవాలి. మనకు రజోగుణం, తమోగుణం, సత్వగుణం ఉన్నాయి. రజోగుణం, తమోగుణం మనకు హృదయంవైపు దారి కనబడనివ్వవు. సత్వగుణం కూడా గుణమే అయినా అది హృదయంవైపుకు దారి చూపించి ప్రక్కకు తప్పకొంటుంది. మనం హృదయం వైపుకు ప్రయాణం చేయాలంటే సాత్వికవాక్కు, సాత్వికకర్మ, సాత్వికబుద్ధి ఉండాలి. మనం ఏదైనా మాట చెపుతూ ఉంటే అది నిర్మలంగా ఉండాలి, ఇతరుల హితవు కోరి చెప్పాలి, వారికి అర్థమయ్యేలాగ చెప్పాలి, వారికి ఆచరించాలనే బుద్ధి కలగాలి మనం మాట చెప్పే పద్ధతి అలాగ ఉండాలి. నువ్వు గుర్తింపులు కోరుకొంటూ కర్మ చేస్తే అది సాత్విక కర్మ కాదు. నీవు చేసే కర్మ నిర్మలంగా ఉండాలి, ఆడంబరం ఉండకూడదు, గుర్తింపులు కోరవద్దు. మీ మాట సాత్వికంగా ఉంటే, మీరు చేసే పని సాత్వికంగా ఉంటే మీకు సాత్వికబుద్ధి వస్తుంది. సత్య సాక్షాత్కారానికి సాత్వికబుద్ధి సహకరిస్తుంది. మీరు ఏ మార్గాన్ని అవలంభించినా జీవలక్షణాల నుండి బయటకు రాకుండా, ప్రకృతి గుణాలనుండి విడుదలపొందకుండా నీకు సత్యసాక్షాత్కారం కలుగదు. ఎవరికీ పెట్టకుండా మనకు ఉన్నది అంతా మనమే తినేస్తున్నాము అనుకోండి, మీరు నెంబర్ వన్ దొంగలు అన్నాడు పరమాత్మ. అదేమిటి మేము కష్టపడుతున్నాము, అందుచేత మేము తినేస్తున్నాము అంటే అయితే మీరు కూలివారు అన్నాడు.

ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. దానిని కొంతమంది దేహంగా చేస్తున్నారు, కొంతమంది మనస్సుగా చూస్తున్నారు, కొంతమంది ప్రపంచంగా చూస్తున్నారు, దానిని రకరకాలుగా చూస్తున్నారు. అది ఎలాగ ఉందో అలాగ దానిని ఎవరూ దర్శించలేకపోతున్నారు, అదే నీ అశాంతికి కారణం, నీ ఉద్రేకానికి కారణం. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు దర్శనమయితే నీకు భయం లేదు. దుంగ దుంగలాగ కనిపిస్తే నీకు భయంలేదు, దుంగ దుంగలాగ కాకుండా దొంగలాగ కనిపిస్తే నీకు భయం కలుగుతుంది. మనస్సును పెంచుకోవద్దు, మనోనాశనానికి

కృషి చేసుకోండి. మనస్సు ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు. అందుచేత నీ జీవితవిధానం అంతా మనోనాశనానికి సహకరించాలి. మాయ ఎంత బలీయంగా ఉంటుంది అంటే మీ అమ్మగారి తోటి, నాన్నగారి తోటి మాట్లాడుతున్నారా అని ఈ మధ్యన పాలకొల్లులో ఒకరిని అడిగాను. ప్రస్తుతానికి మాట్లాడటం లేదు, వారికి బుద్ధి వచ్చాక మాట్లాడుతాను అన్నారు. మాయ అంటే ఇదే వీడికి బుద్ధి లేదు, వాళ్ళకి బుద్ధి లేదు అనుకొంటున్నాడు. నేను ఏమని చెప్పాను అంటే పోనీ వారికి బుద్ధి లేదు, మీకు బుద్ధి ఉంది కదా, మీ బుద్ధిని ఉపయోగించి వారికి బుద్ధి వచ్చేటట్లు చేయవచ్చు కదా. బతికి ఉండగా వారికి బుద్ధి రాదు అనుకో, వారు చనిపోయిన తరువాత నీకు చూడాలనిపిస్తుంది అనుకో నువ్వు ఎవరిని చూస్తావు. ఇవన్నీ మనస్సు యొక్క లక్షణాలు. కళ్ళు తెరిస్తే మాయలో పడిపోతానేమో, చెవులతో ఏదైనా మాటలు వింటే మాయలో పడిపోతానేమో, గుమ్మందాటి బయటకువెళితే మాయలో పడిపోతానేమో అని ఇలా అనుకొంటూ ఉంటే ఇంక నువ్వు ఎందుకు పనికి వస్తావు. భగవంతుడు నీకు అవయవాలు ఇచ్చాడు. ఇవన్నీ ఎవడైతే ఇచ్చాడో వాడిని పొందటానికి వీటిని మేగ్జిమమ్ ఉపయోగించుకొని వాడి పాదాల దగ్గరకు చేరుకో. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను వృధా చేసుకోవద్దు. నీకు మాయ కనిపిస్తూ ఉండాలి ఆ మాయలో పడకూడదు. భోగాలు అన్నీ నీకు ఎదురుగుండా ఉండాలి కాని నీకు వాటి మీద ఆకర్షణ కలుగకూడదు అన్నాడు కాళిదాసు. మనకు అన్నీ అందుబాటులో ఉండాలి అయినా మనకు వికారం రాకూడదు అంతేగాని ద్రాక్షపండ్లు అందటం లేదు కాబట్టి పుల్లగా ఉన్నాయి అనుకోకూడదు.

రాగద్వేషాలు లేకుండా చూసుకోండి. మీకు ఇష్టం ఉన్నా, అయిష్టం ఉన్నా కూడా మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. అందుచేత ఇష్టం ఎంత ప్రమాదమో అయిష్టం కూడా అంతే ప్రమాదం. రోడ్డు మీద జనం అలా వెళ్ళిపోతున్నారు అనుకోండి, వారి మీద మనకు ఇష్టం ఉండదు, అయిష్టం ఉండదు, అలా మనం ఉండగలగాలి. మీకు ఎక్కడా ఇష్టాలు, అయిష్టాలు లేవు అనుకోండి మీరు పాపం కూడా చెయ్యరు, అసలు చెడ్డ చెయ్యవలసిన పని మీకు లేదు. ఎక్కడైనా ఇష్టం ఉంటే అక్కడ ఉపకారం చేయాలనిపిస్తుంది. ఉపకారం కోసం ఉపకారం చేయటం వేరు. ఇష్టం ఉంది కాబట్టి ఉపకారం చేయటం, అయిష్టం ఉన్నచోట అపకారం చేయటం ఇలా చేయటం వలన పాపం పెరిగిపోతుంది. మనం తొందరగా బాగుపడాలి అంటే వారు అటువంటి వారు, వీరు ఇటువంటి వారు అని తీర్పులు చెప్పటం మానివేయాలి. మా ఆయనే నాకు గురువు అని ఈ మధ్య రాజమండ్రిలో ఒకరు చెప్పారు, ఎందుకు అని నేను అడిగాను. ఇంట్లో గొడవ తప్పించి చుట్టాల గొడవగాని, బయట గొడవలుగాని చెపితే నీకు

పనీపాటు ఏమీలేదా, లోకంలో మనుషులు 90 రకాలుగా ఉంటారు, వారి పద్ధతిలో వారు ఉంటారు, నీ పద్ధతిలో నీవు బతుకు. వారి గొడవ నీకు ఎందుకు అనేవారు. అలా ఒక సంవత్సరానికి ఆయన పద్ధతి అంతా నాకు వచ్చేసింది, ఇంక ఇతరుల గొడవ నాకు లేదు. నా మనస్సులో మార్పు వచ్చింది, మా ఆయనే నాకు గురువు అంది. నీకు కాలక్షేపం అవ్వటం లేదు అనుకో మంచి గ్రంథం చదువుకో అంతేగాని రోడ్డు మీద దుమ్ము ముఖానికి రాసుకోవద్దు. దేహంతో తాదాత్మ్యం పొందే తలంపులోనుండి బయటకు వచ్చేవరకు విషయాలు పీడిస్తాయి, లోకం పీడిస్తుంది, మరణానంతరం లోకాలకు తిరగటం తప్పదు. దేహము నేను అనే మొదటి తలంపు ఉన్నంతకాలం నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, లోకం ఉంది, దేవుడు ఉన్నాడు, పుణ్య పాపాలు ఉన్నాయి, జన్మలు ఉన్నాయి, అన్నీ ఉన్నాయి, అది లేకపోతే ఏదీలేదు, నువ్వు మిగులుతావు, అదే నిర్వాణసుఖం, అప్పడు ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా ఆనందమే.

మనం వాళ్లని మాయ చేసాము, వీళ్లను మాయ చేసాము అనుకొంటాము కాని ఈశ్వరుడు మనల్ని మాయచేస్తాడు. ఈశ్వరుడు ఎంత మాయావో చూడండి. పూర్వం భాస్కరాచార్యుడు అని ఆయన గణితంలో పెద్దవాడు. ఆయనకు జ్యోతిష్కం కూడా వచ్చు. ఆయనకు ఒక అమ్మాయి ఉండేది. ఆ అమ్మాయి జాతకం ప్రకారం పెళ్లి అయిన సంవత్సరం తరువాత భర్త చనిపోతాడు అని ఉంది, అది మార్చేయాలి అనుకొన్నాడు. ఆయన పెళ్లి ముహూర్తాలు బాగా పెట్టగలడు. ఆయన లెక్కలు కట్టి ముహూర్తం పెట్టాడు. ఆయన లెక్క కరెక్టు అయితే ఆ లగ్నం ప్రకారం భర్తకు చావురాదు. ఆయన తెలివి అంతా ఉపయోగించి అమ్మాయికి వైధవ్యం రాకుండా చూడాలని లెక్కలు కట్టాడు. ఆ లెక్కలు కట్టడంలో పొరపాటు అయ్యి మూడు నిమిషాలు ఆలస్యంగా మూహూర్తం పెట్టాడు. సంవత్సరం తరువాత అమ్మాయికి భర్త చనిపోయాడు. ఏమిటి ఇలా జరిగింది అని, ఎక్కడ తప్పు చేసాము అని మరలా అన్నీ చూస్తే మూడు నిమిషాలు లేటుగా ముహూర్తం పెట్టాము అని అప్పడు ఆయనకు తెలిసింది. ప్రారబ్దంలో ఏది జరగవలసి ఉందో అది జరిగి తీరుతుంది. ఈశ్వరుడు మాయావి. అటువంటి మేధావి చేత తప్పు చేయించాడు. ఈ సృష్టిలో సర్వజ్ఞుడు ఒక్కడే, వాడే ఈశ్వరుడు. ఈశ్వరుడి మీద మనకు గౌరవం ఉండాలి, భక్తి ఉండాలి, ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనేటువంటి సజీవమైన విశ్వాసం ఉండాలి. ఇతరులను విమర్శించటం కంటే ఇతరులచేత నువ్వు విమర్శించబడటమే నీ ఆధ్యాత్మికఅభివృద్ధికి మంచిదేమో అన్నాడు వర్డ్స్వర్త్. అన్నవాళ్ళు అభివృద్ధిలోనికి రారు, పడ్డవారు అభివృద్ధిలోనికి వస్తారు. మీలో ఎవరైనా అదృష్టవంతులు ఉంటే, మీలో ఎవరికైనా రోజులు బాగా వెళ్లిపోతూ ఉంటే మంచిదే కాని కాలం తీసుకువచ్చే

అదృష్టం చూసి గర్వపడవద్దు, మీ మొఖంలో అవినయం రానివ్వకండి. నీ హృదయంలో ఒక నిజం ఉంది. దానికి చావు లేదు, పుట్టుక లేదు, దానికి దేహం అక్కరలేదు. బాహ్యంగా వచ్చే హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా నీ మనస్సును హృదయంలో ఉన్న నిజంమీద నిలబెడితే అప్పడు అది నీకు ఎరుకలోనికి వస్తుంది. అది మనం నోటితో చెప్పకొన్నంత తేలిక కాదు. దానికి చాలా ధైర్యం ఉండాలి. వారు ఏమనుకొంటున్నారు, వీరు ఏమనుకొంటున్నారు అనుకొంటే నువ్వు హృదయగుహలోనికి వెళ్లలేవు. మనం సుఖపడాలంటే ఒక మార్గం చెపుతున్నాను. ఒకడవౌ నిను మాయ మొనరించి వచ్చువారు ఎవరు ఇది నీజాలము అరుణాచలా. నీవు ఒక్కడివే కాని ఇన్ని రూపాలలో కనిపిస్తున్నావు. ఈ జాలంలో మేము పడ్డాము. మాయ ఆయన చేతిలో ఉంది, మాయ చేతిలో మనం పడ్డాము. అందుచేత ఆయన పాదాలను ఆశ్రయించి ఈ మాయలో నుండి బయటపడాలి. భౌతికం వేరు, ఆధ్యాత్మికం వేరు అని చాలామంది అనుకొంటున్నారు. భౌతికం వేరు, ఆధ్యాత్మికం వేరు కాదు. దేవుడి దగ్గర అరటిపండు పెట్టేటప్పడు ఏ భావనతో పెడుతున్నావో, ఎవరికైనా ఇచ్చేటప్పడు కూడా అదే భావనతో ఇవ్వాలి, అలా చేస్తే ప్రతీదీ పూజే, అప్పడు ఉన్నదంతా ఆధ్యాత్మికమే, ఇలా కనుక మనం అర్థం చేసుకొని చేస్తే అంతా పూజే, అప్పడు మీకు మారుమనస్సు కలుగుతుంది, ఈశ్వరుని దయకు పాత్రులవుతారు, మీరు తరిస్తారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 21-05-06, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రతీ మనిషికి సుఖం కావాలి, శాంతి కావాలి. శాంతి ఎక్కడ దొరకదో, సుఖం ఎక్కడ దొరకదో అక్కడ మన ఇంద్రియాలు వెదుకుతూ ఉంటాయి. మనస్సు వెదుకుతూ ఉంటుంది. బేసిక్‌గా మనం చేసే పొరపాటు అది. ప్రపంచంలో సుఖం లేదు, శాంతి లేదు. నిష్ప్రపంచస్థితిని పొందినవాడిని, ప్రకృతిని దాటినవాడిని శాంతి వరిస్తుంది, సుఖం వరిస్తుంది కాని ఎవడైతే ప్రకృతిని అతిక్రమించలేడో వాడికి శాంతి లేదు, సుఖం దొరకదు. మనం పుస్తకం చదివేటప్పడు అంతా అర్థమయిపోయింది అని అనుకొంటాము కాని ఏమీ అర్థమవ్వదు. ఉదాహరణకు ఒక వాక్యం చెపుతాను. అహంభావన ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు. మీలో ఈ వాక్యం ఎంతమందికి అర్థమయ్యింది. అహంభావన ఉండటం, దానిని పోగొట్టుకోవటం మాట వదిలివేయండి. అసలు అహంభావన అంటే ఇట్టిది అని తెలియటానికి కొన్ని జన్మలు పడుతుంది. కృష్ణుడు గీతలో చెప్పాడు సాధన చేయనివారి మాట వదిలివేయండి, సాధన ప్రారంభించిన తరువాత కూడా బహుజన్మలు కృషి చేస్తేనే కాని వారికి ఆత్మజ్ఞానం కలుగదు అని పరమాత్మ

చెప్పాడు. సత్యం కానిదానిని సత్యం అనుకోవటం, ఆత్మకానిదానిని ఆత్మ అనుకోవటం ఇలా తిరకాసు పెట్టేది ఎవరో ఇతరులు కాదు, అహంభావనే చేస్తోంది. శరీరానికి వచ్చిన జబ్బును తొందరగా వదిలించుకోగలం కాని అహంభావనను వదిలించుకోవటం చాలా కష్టం. ఒక మనిషిలో ఎంతకాలం అయితే అహంభావన ఉందో వాడికి వెయ్యి కోట్ల డబ్బు ఉన్నా, ఎంత చదువు ఉన్నా కూడావాడు దుఃఖంలో నుండి బయటకు రాలేడు.

మన పుట్టుకతోటే శరీరంతో పాటు రాగద్వేషాలు కూడా వచ్చేసాయి, వయస్సు వచ్చేకొలది వాటి ప్రభావం మన మీద పడుతూ ఉంటుంది. రాగద్వేషముల యొక్క వేగం చాలా బలీయంగా ఉంటుంది. గోదావరికి వరద వచ్చింది అనుకోండి. వరద వచ్చినప్పడు నాకు ఈత వచ్చును అని ఈదటానికి ప్రయత్నం చేస్తే ప్రయోజనం లేదు, ప్రవాహవేగంలో కొట్టుకొని పోతావు. అలాగే మనం ఏదో గుడికి వెళుతున్నాము, అభిషేకాలు చేస్తున్నాము. ఏదో కర్మ చేస్తున్నాము అంటే రాగద్వేషాల నుండి బయటకు రావటానికి ఇది సరిపోదు, దానికి చాలా సాధనాబలం ఉండాలి. ప్రతీ మనిషి రాగద్వేషముల యొక్క వేగంలో కొట్టుకొని పోవటం వలన వాడి మనస్సు హృదయంవైపుకు తిరగదు, వాడు సత్యాన్వేషకుడు కాలేడు, ఆత్మసుఖాన్ని పొందలేడు. ఒక మనిషి దుర్మార్గంలో ఉన్నాడు అనుకోండి, వాడు పూజ చేస్తూ ఉంటాడు, జపం చేస్తూ ఉంటాడు అనుకోండి. వాడికి భగవంతుడు తెలియబడడు. భగవంతుడు అమాయకుడు కాదు. నీవు చేసేటప్పడు ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నావో ఆ తలంపును భగవంతుడు చూస్తాడు, బాహ్యంగా నీవు చేసే పనిని ఆయన చూడడు. ఉపనిషత్‌లో ఒక మాట ఉంది. శిష్యుడు గురువు దగ్గరకు వెళ్ళి ఏదైనా బోధ చేయమని అడిగాడు. "ద, దా, దా" ఈ మాటలు మీరు అర్థం చేసుకొని ప్రాక్టీసు చెయ్యండి అని గురువు చెప్పాడు. మొదటి 'ద' అంటే దమం. అంటే ఇంద్రియాలను, మనస్సును అదుపులో పెట్టుకోవాలి. నీకు ఇంద్రియ నిగ్రహం లేదు అనుకో, మనోనిగ్రహం లేదు అనుకో ఏ పని చేసినా ప్రయోజనం లేదు. ఆధ్యాత్మికచింతన మాట అటు ఉంచు నీవు ఈ లోకంలో కూడా ఏదీ సాధించలేవు. అన్ని భోగాలు ఎదురుగా ఉండాలి, నీ మనస్సు చలించకూడదు, అది కంట్రోలు, అది దమం. రెండోది 'దా' అంటే దానం. ప్రతీ మనిషికి గివింగ్ హేబిట్ ఉండాలి. ఈమధ్య జరిగిన సంఘటన చెపుతున్నాను. కె.వి. రమణ అని ఆయన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, కంప్యూటర్ కంపెనీ పెట్టుకొన్నాడు, చాలా లాభాలు వచ్చాయి. ఆయన షిరిడీ సాయి భక్తుడు. ఆ కంపెనీ నడపటానికి ఎంత డబ్బు అవసరమో చూసుకొని మిగిలిన 30 కోట్లు డబ్బు షిరిడీ బాబా ట్రస్టువారికి ఇచ్చి సేవారంగం, విద్యారంగం ఇలా ఖర్చు పెట్టమని చెప్పాడు. ఆ ట్రస్టు బోర్డువారు ఆయనను గౌరవించి, మీరు ఇచ్చిన డబ్బుకు కృతజ్ఞత

తెలియపరుస్తున్నాము అన్నారు. ఆయన గొప్పతనం చూడండి. ఆయన ఏమి చెప్పారు అంటే భగవంతుడి దయవలన ఆ డబ్బు వచ్చింది. ఆయన ఇచ్చినది ఆయనకే ఇస్తున్నాను. నాకు కృతజ్ఞత చెప్పనక్కరలేదు. అందుచేత మీరు భగవంతుడికి కృతజ్ఞత చెప్పండి అన్నాడు. డబ్బు ఇచ్చేటప్పుడు కూడా నేను ఏదో ఘనకార్యం చేస్తున్నాను అని ఆయన అనుకోలేదు. మనం తమలపాకులో అరటిపండ్లు పెట్టి ఇతరులకు ఎంత తేలికగా ఇస్తామో అంత తేలికగా 30 కోట్లు ఇచ్చాడు. మనం ఏదైనా పనిచేసేటప్పుడు గుర్తింపులు కోరుకొంటాము అనుకోండి. గుర్తింపులు కోరుకోవటం వలన మనకు తెలియకుండా వ్యక్తిభావన పెరిగిపోతుంది. దానం గురించి బైబిలులో ఒక మాట చెప్పాడు. మీ ఆదాయంలో దశమభాగం అంటే మీకు సంవత్సరానికి 10 లక్షలు ఆదాయం వస్తే 9 లక్షలు మీరు ఎంజాయ్ చెయ్యండి, ఒక లక్ష తీసి ఇతరుల కోసం మీకు ఏరకంగా ఇష్టమైతే ఆరంగంలో ఉపయోగించండి, ఆ లక్ష మీది కాదు అనుకోండి అని చెప్పాడు. మూడోది “దయ”. నువ్వు ఏ పని చేసినా యాంత్రికంగా చెయ్యకు, హృదయంలో దయారసం పెట్టుకో. నీవు ఇతరులకు డబ్బు ఇయ్యి, మాట సహాయం చెయ్యి, అన్నం పెట్టు. ఏది చేసినా ప్రేమతో వారి పట్ల దయగా ప్రవర్తించు. నీ దయాగుణం వారి చైతన్యస్థాయిని పెంచాలి. తిండి లేనివారిని చూసి, నీడలేనివారిని చూసి కనీసం మనస్సులో అయ్యో అని కూడా అనుకోలేరు అనుకోండి, మీరు దురాత్ములే. నీకు డబ్బు ఉంటే డబ్బు ఇవ్వవచ్చు లేకపోతే లేదు. దయకు డబ్బుకు సంబంధం లేదు. నీవు దయాస్వరూపుడవు అయితే నీకు చదువు వస్తే వారికి చదువు చెప్పవచ్చు లేకపోతే వారు బాగుపడటానికి మంచిమార్గం చూపించవచ్చు, ఇదంతా దయలోనికి వస్తుంది. దయ అనేది ఒక రూపం ధరించి భూమి మీద నడుస్తూ ఉంటే ఎలా ఉంటుందో వాడే గౌతమబుద్ధుడు. దయ వలన నీకు మారు మనస్సు వస్తుంది, లోపల సంస్కరింపబడతావు. కొంతమందికి మాటలో, చేతలో, ఆలోచనలో హింసా ప్రవృత్తి ఉంటుంది. హింసాప్రవృత్తి ఉన్నవాడికి దయ కలుగదు. మనం భౌతికంగా ఏదైనా చేయగలుగుతాం లేకపోతే లేదు. మనం ఎప్పుడూ రైట్‌సైడ్‌లో ఉండాలి కాని రాంగ్ సైడ్‌కు వెళ్ళకూడదు. వ్యవహారంలో ఏదో తాత్కాలిక ప్రయోజనాలను ఆశించి రాంగ్‌సైడ్‌లో ఉండకూడదు. నీకు చేతనైతే రైట్‌సైడ్‌లో ఉండు, లేకపోతే ఊరక ఉండు. నీవు రాంగ్ సైడ్ లోనికి వెళితే చెడిపోతావు, చరిత్ర హీనుడవు అవుతావు. మీకు డబ్బు ఉంది, చదువు ఉంది, గౌరవం ఉంది, అన్ని అవకాశములు ఉన్నాయి అనుకోండి. మీకు క్రమశిక్షణ లేకపోతే మీరు సుఖపడరు. బాహ్యంగా మనకు ఉన్న అనుకూలపరిస్థితుల కంటే గొప్ప విషయం క్రమశిక్షణ. క్రమశిక్షణ లేనప్పుడు మనం ఇక్కడ సుఖపడలేము, పరలోకంలో సుఖపడలేము. ఉద్యోగానికి

రాజీనామా చేసి మీ సమక్షంలో గడుపుదామని అనుకొంటున్నాను అని భగవాన్‌తో అంటే చైతన్యం అంతటా ఉంది. అంతటా ఉన్న వస్తువును తెలుసుకోవటానికి నువ్వు వివేకం పెంచుకో, వైరాగ్యం పెంచుకో. నువ్వు ఉద్యోగం మానివేసి నా దగ్గర కూర్చొంటే జ్ఞానం వచ్చేయదు, సోమరితనం వస్తుంది అన్నారు. అభ్యాసం, వైరాగ్యం గురించి గీతలో రిపీటెడ్‌గా పరమాత్మ చెప్పాడు. వైరాగ్యం ఉన్న మనిషికి చాపల్యం తగ్గుతుంది. వైరాగ్యం లేని మనిషి కంటే వైరాగ్యం ఉన్నవాడు పని ఎక్కువ చేస్తాడు, బాగా చేస్తాడు. ఎందుచేతనంటే వాడికి ఎటాచ్‌మెంట్ ఉ ండదు. ఫలకాంక్ష మీద మనస్సు ఉన్నవాడు చేతిలో ఉన్న పనిని పాడుచేస్తూ ఉంటాడు. భగవాన్ దగ్గర ఎవరో కూర్చుని మాట్లాడుతూ ప్రపంచయుద్ధం వచ్చేసింది అంటారు. నువ్వు ఆలోచించి ప్రపంచయుద్ధాన్ని ఆపుచేయగలవా అని భగవాన్ అడిగారు. అది నా చేతిలో పని కాదు అన్నాడు. నీ చేతిలో లేని పని గురించి ఆలోచించి ఎందుకు కాలాన్ని వృధాచేసుకొంటావు అన్నారు భగవాన్.

ప్రతీ మనిషిలో ఉన్న బలహీనత ఏమిటి అంటే మనం ఆనందంగా ఉంటే, శాంతిగా ఉంటే మనకు దేవుడు గుర్తుకురాడు, మన తెలివితేటల వలన సుఖంగా ఉన్నాము అనుకొంటాము, దుఃఖం వచ్చింది అనుకోండి అప్పడు దేవుడు ఇలా చేసాడు అంటాము. నువ్వు అశాంతిగా ఉన్నప్పడు ఏ దేవుడు కారణం అనుకొంటున్నావో నువ్వు శాంతిగా ఉండటానికి కూడా ఆయనే కారణం అన్న సంగతి మరిచిపోతున్నావు. అంతా ఈశ్వర సంకల్పంతోనే నడుస్తోంది. ఈ జీవకోటి ద్వారా ఈశ్వరుడే పని చేస్తున్నాడు అని నీకు అర్థమైనప్పడు నీకు అశాంతి రాదు. మనకు శరీరంతోపాటు లోపల మనస్సు ఉంది. శరీరానికి అన్నంపెట్టి, బట్ట కడితే సరిపోదు. లోపల మనస్సును క్రమశిక్షణలో పెట్టాలి, దానికే పూజ, జపం, ధ్యానం మన పెద్దలు ఏర్పాటుచేసారు. సన్యాసం అంటే బట్టలు మార్చుకోవటం కాదు. నీ కుటుంబ సభ్యులను విడిచిపెట్టి, బాధ్యతలు విడిచిపెట్టి ఎక్కడికో పారిపోవటం కాదు, లోపల వ్యక్తిగతమైన కోరికలు తగ్గించుకొని, మమకారం తగ్గించుకొని, అహంభావ రహితంగా పనిచెయ్యి, అది సన్యాసం. మీరు ఎన్ని మంచి పనులు చేసినా సరే దేహమే సత్యం, దేహమే ఆత్మ అనుకొన్నంతకాలం నిన్ను అశాంతి విడిచిపెట్టదు. మీరు ఏదైనా మంచిపని చేస్తారు అనుకోండి, అందరూ మెచ్చుకొంటారు అని ఎప్పడూ అనుకోవద్దు. మీ మీద అసూయ ఉన్నవారు మెచ్చుకోరు, దానికి సిద్ధమయ్యే ఆ మంచిపని చెయ్యాలి. వాడు అసూయ పడుతున్నాడు అంటే దానికి మీరు ఆశ్చర్యపడనక్కరలేదు, అది వాడి స్వభావం, అంతకంటే వాడికి ఇంకోటి చేతకాదు. నలుగురు అన్నదమ్ములు ఉన్నారు అనుకోండి. అందులో ఒకడు బాగుపడుతున్నాడు అనుకోండి, మిగిలిన ముగ్గురికి అసూయ

వచ్చేస్తుంది, అది జీవలక్షణం.  శరీరంలో మలం ఎలా ఉంటుందో అలాగ మన మనస్సులో కూడా మలం ఉంటుంది. ఇష్టాయిష్టాలు మనస్సులో ఉన్న మలం.  నాకు సైకిల్ లేదు.  మీరు కష్టపడి సంపాదించుకొని సైకిల్ కొనుక్కొన్నారు, మీమీద నాకు అసూయ వచ్చేస్తుంది ఎందుచేతనంటే నాకు సైకిల్ లేదు కాబట్టి.  ఓ మనిషి, ఏదైనా రంగంలో అభివృద్ధిలోనికి వస్తాడు అనుకోండి, వాడు అభివృద్ధిలోనికి వచ్చాక అది మన కళ్లకు కనిపిస్తూ ఉంటుంది. దాని వెనకాల ఎంత పోరాటం ఉందో, ఎంత సహనం ఉందో, వాడు ఎంత కష్టపడ్డాడో ఆ స్ట్రగుల్ మనకు కనబడదు, మన అసూయ ఆ రకంగా  ఆలోచించనివ్వదు అందుచేత అది మనకు అర్థం కాదు.  కృష్ణుడు అర్జునుడితో మనిద్దరం చాలాకాలం కలిసి తిరిగాము, ఎప్పడూ నీలో అసూయ కనబడలేదు, నీవు అనసూయుడవు, ఆ ఒక్క సుగుణానికి నీకు లొంగిపోయి నీకు గీతను ప్రవచనం చేస్తున్నాను అన్నాడు పరమాత్మ.

లోకంలో నీకు ఇష్టమైనవి జరుగుతూ ఉంటాయి, ఇష్టం లేనివి కూడా జరుగుతూ ఉంటాయి.  నువ్వు చేసే పనిమటుకు ఇష్టంగా, ప్రేమగా చేసుకొంటూ వెళ్ళు.  ఈ లోకం ఏమైపోతుంది, అది ఏమైపోతుంది, ఇది ఏమైపోతుంది అని కంగారుపడకు.  లోకానికి ఒక కర్త ఉన్నాడు, ఆయన చూసుకొంటాడు.  నీలో మంచి లేనప్పడు లోకానికి మంచి చేస్తాను అంటావు ఏమిటి?  నీలో సేవాభావం లేనప్పడు లోకానికి సేవ చేస్తాను అంటావు ఏమిటి? ఎవరిని మోసం చేస్తావు నువ్వు?  మీ ఇంటికి పంచదార అవసరం అనుకోండి.  యజమాని పంచదార తెస్తాడు కాని నేను సేవ చేసాను అని అనుకోడు.  ఆ పంచదార ఎవరికైనా ఇతరులకు ఇస్తే నేను సేవ చేసాను అనుకొంటాడు, ఇది దుర్మార్గ ప్రవృత్తి.  అంటే మీ ఇంటిలోనివారు మీ వాళ్ళు, లోకం పరాయిది, ఇంక నీకు జ్ఞానం ఏమిటి?  మీ ఇంట్లోని వారు నీ సొంతం అనుకొంటున్నావు కాబట్టి నువ్వు కష్టపడ్డాను అనుకోవటం లేదు, అదే మీ గ్రామానికో, దేశానికో చేస్తే కష్టపడ్డాను అనుకొంటున్నావు.  అంతకంటే దుర్మార్గ ప్రవృత్తి ఏముంది.  ఒక కేజీ పంచదార ఎవరికైనా ఇస్తే గుర్తింపు కోరతారు, వాడు జీవితం పొడుగునా బానిసగా ఉండాలి అనుకొంటారు, ఇదంతా అహంభావన యొక్క చేష్టలు.  ఈ శరీరం చనిపోయే లోపు అహంభావన అంటే ఇట్టిది అని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి.  దేవుడు ఉన్నాడా అని ఒకరు భగవాన్‌ను అడిగారు.  ఆయన ఉన్నాడని చెప్పలేదు, లేడని చెప్పలేదు, నువ్వు ఉన్నావా అన్నారు?  నేను ఉన్నాను అని చెప్పాడు.  నువ్వు ఉంటే ఆయన లేకుండా ఎక్కడికి పోతాడు, ఆయనా ఉన్నాడు. నువ్వు లేవనుకో ఆయనా లేడు.  ఆ నేను లేని స్థితిని మనం ఊహించలేము, అది అనుభవైక వేద్యం.  ఇతర లోకాలు ఉన్నాయా అని ఒకరు భగవాన్‌ను అడిగారు ఆయన ఇతర లోకాలు

ఉన్నాయి అని చెప్పలేదు, లేవని చెప్పలేదు. దేహం మరణించాక ఎవడైతే ప్రయాణం చేస్తాడో ఆ ప్రయాణం చేసేవాడు ఎంత నిజమో ఆ లోకాలు కూడా అంతే నిజం. వాడు ఉంటే ఆ లోకాలు ఉన్నాయి, వాడు లేకపోతే అవి కూడా లేవు.

మనకు లోపల సత్వగుణం ఉంది అనుకోండి. క్వయిట్‌గా ఉంటాము, కూల్‌గా ఉంటాము, పని చేసినా చేసినట్లుగా కనబడము. మనం అందరం మంచివారము అనుకోండి, సత్వగుణంలో ఉన్నాము అనుకోండి, ఈ కళ్యాణ మండపంలోనికి వచ్చి వెళ్ళిన జాడ కూడా ఎవరికీ తెలియదు. ఒకో చుట్టం మన ఇంటికి వస్తే వాడు వచ్చి వెళ్ళిన జాడ కూడా తెలియదు, ఒకో చుట్టం వచ్చాడంటే మన కొంప అంతా అల్లరి చేసి వెళ్ళిపోతాడు. మన కొంప అంతా అల్లరి చేసి పోయే చుట్టం రజోగుణంలో ఉన్నాడు, నిశ్శబ్దంగా ఉండి వాడి పని ఏదో వాడు చేసుకొని వెళ్ళిపోయేవాడు సత్వగుణంలో ఉన్నాడు. ఇంక కొంతమంది చుట్టాలు ఉంటారు, ఏమండీ మేము మూడు రాత్రులు ఉండి వెళ్ళిపోతాము అంటారు. శివరాత్రి, సంక్రాంతి, నవరాత్రి ఈ మూడు రాత్రులు చూసి వెళ్ళిపోతే వాడికి సంవత్సరం అయిపోతుంది, వాడు తమోగుణం వాడు. వాడు తినేసి ఊరకే అలా పడి ఉంటాడు. అంటే కంచం, మంచం రెండూ అంటిపెట్టుకొని ఉంటాడు. మనం అభివృద్ధిలోనికి రావాలంటే రజోగుణం తగ్గించుకోవాలి, తమోగుణం తగ్గించుకోవాలి, సత్వగుణాన్ని పెంచుకోవాలి. మీరందరూ కష్టపడి డబ్బు ఎలా సంపాదించుకొంటున్నారో, పిల్లలు కష్టపడి ఎలా చదువు కొంటున్నారో, అలా కష్టపడి మనం సత్వగుణాన్ని సంపాదించుకోవాలి, కష్టపడకపోతే ఏదీ రాదు. ఒకవేళ కష్టపడకుండా వస్తే అది ఎలాగ వచ్చిందో అలాగే పోతుంది. శరీరానికి దుఃఖం రాదు, చైతన్యానికి దుఃఖం లేదు. మధ్యలో ఉన్న అహంభావనకే దుఃఖం వస్తుంది. తలంపులు అన్నీ ఎవరికి వస్తున్నాయి, అహంభావనకే వస్తున్నాయి, తలంపు లేకుండా దుఃఖం లేదు. దేహం మరణించినప్పుడు నేను చనిపోతున్నాను అని దేహం అనుకోదు, దేహంతో తాదాత్మ్యం పొందే తలంపు అనుకొంటుంది. అందుచేత దేహంతో తాదాత్మ్యం పొందే తలంపు ఎంత నిజమో నీ దేహానికి సంబంధించిన చావు కూడా అంతే నిజం. శాస్త్రకారుడు ఏమని చెప్పాడు అంటే మనిషి 90 సంవత్సరాలు బతికాడు అనుకోండి. మొదటి 30 సంవత్సరాలు కష్టపడి చదువుకో, తరువాత 30 సంవత్సరాలు నువ్వు సంపాదించుకో అంటే బజారులో పడి అడ్డంగా సంపాదించమని కాదు, నీతి న్యాయం కాపాడుకొంటూ సంపాదించుకో. మిగతా 30 సంవత్సరాలు ఆత్మజ్ఞానం సంపాదించుకో. నీవు చేస్తే నిష్కామకర్మ చెయ్యి అంతే గాని సమాజంలో ఏదో గౌరవం ఆశించి పనులు చేస్తే అది సకామకర్మ అవుతుంది కాని నిష్కామకర్మ కాదు. ఏమీ లేదు నాన్నగారు బాగా చెపుతున్నారు అని మీరు అనుకోవాలని

నేను అనుకొంటాను అనుకోండి. నేను ఫెయిల్ అయినట్లే, నేను బాగుపడను, నా అహంభావన పెరుగుతుంది. మీకు శాంతి అందటం లేదు అనుకోండి, నేను చెప్పే సబ్జక్టు మీకు అర్థమవ్వటం లేదు అనుకోండి నేను బాగా చెపితే మటుకు మీకు కలిసివచ్చేది ఏమిటి? చైతన్యంలో ఎక్కువ అనీ, తక్కువ అనీ, పుణ్యం అనీ, సత్కర్మ అనీ, సత్వగుణం అనీ ఏమీ లేవు. కాని నిన్ను ఎందుకు పుణ్యం సంపాదించుకోమంటున్నారు, ఎందుకు సత్కర్మ ఆచరించమంటున్నారు, ఎందుకు సత్వగుణం పెంచుకోమంటున్నారు అంటే చైతన్యాన్ని అందుకోవటానికి ఇవి అన్నీ సహకరిస్తాయి కాబట్టి వీటిని ప్రాక్టీసు చేయమంటున్నారు కాని ఇవి ఏమీ అక్కడ లేవు.

మేము లోకానికి సేవ చేస్తాము అని భగవాన్‌తో అంటే ముందు నీకు నువ్వు సేవ చేసుకో అంటే దాని అర్థం ఏమిటి అంటే ముందు నువ్వు బాగుపడు, నిన్ను నీవు సంస్కరించుకొంటే నిన్ను చూసి అనేకమంది నేర్చుకొంటారు, బాగుపడతారు. నీలో శాంతి లేనప్పడు, నీలో జ్ఞానం లేనప్పడు నీవు మాట్లాడినా ప్రయోజనం లేదు, ఆ మాట ఎవడిమీద పని చేయదు. నీకు శాంతి లేనప్పడు ఎవరికి శాంతిని ఇస్తావు. నథింగ్‌లో నుండి ఏదీ రాదు, సమ్‌థింగ్‌లో నుండి ఏదైనా వస్తుంది. భగవాన్‌తో ఒక ప్లీడరుగారు మాట్లాడుతూ పనిచేసేవాడు ఈశ్వరుడే, వ్యక్తులను పనిముట్లు కింద ఉపయోగించుకొంటాడు అని చెపితే భగవాన్ ఏమి చెప్పారు అంటే మీ నోటితో చెప్పింది మీకు అవగాహనలో ఉంటే దుఃఖం నశిస్తుంది అని చెప్పారు. ఎక్కడో పుస్తకాలు చదివి చెప్పటం కాదు. అంతా ఈశ్వరుడే అనుకొన్నప్పడు, చేసేవాడు చేయించేవాడు ఆయనే అనుకొన్నప్పడు నీకు దుఃఖంతో పని ఏముంది. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే మీకు ధనం ఉంది, అధికారం ఉంది, చదువు ఉంది, గౌరవం ఉంది అన్నీ ఉన్నాయి కాని మీకు దుఃఖం వస్తోంది అనుకోండి ఇవన్నీ ఏమి చేసుకొంటారు. మీకు ఎన్ని కంఫర్ట్సు ఉన్నా దుఃఖం వస్తూ ఉంటే ఆ కంఫర్ట్సు వలన ప్రయోజనం లేదు. మీకు కంట్రోలులో నుండి ఆనందం వస్తుంది కాని కంఫర్ట్సు నుండి ఆనందం రాదు. ఐశ్వర్యవంతులు అందరూ సుఖంగా ఉన్నారు అని అనుకోవద్దు, ఐశ్వర్య వంతులు అయినా, వారికి మనోనిగ్రహం లేకపోతే సుఖం లేదు, వారికీ దుఃఖమే. ధనం వలన భోగం వస్తుంది, జ్ఞానం వలన శాంతి వస్తుంది, భోగం రోగంగా మారిపోతుంది. ఏరకమైన భోగాలు అయినా కూడా అన్నీ మనస్సులో ముద్రలు వేసి వెళ్ళిపోతాయి.

మీకు దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన ఈ మూడు వాసనలు లేవు అనుకోండి, ఇంక దుఃఖం రాదు. ఈ లోకంలో అందరూ మిమ్మల్ని గొప్పగా చెప్పకోవాలి అనుకొంటారు అనుకోండి, మిమ్మల్ని గొప్పగా చెప్పకోకపోతే మీకు దుఃఖం వచ్చేస్తుంది. దేహానికి దీనికి సంబంధం

లేదు. అష్టావక్రుడు సభలోనికి వెళ్ళినప్పుడు ఆయన శరీరాన్ని చూసి ఇన్ని వంకరలు ఉన్నాయి ఏమిటి? అని మంత్రులు అందరూ గొల్లుమని నవ్వారు. అప్పుడు అష్టావక్రుడు రాజుతో ఇటువంటి మూర్ఖులను పెట్టుకొని పరిపాలన చేస్తున్నావు ఏమిటి? అన్నాడు. వారు నా శరీరాన్ని చూస్తున్నారు, నా హృదయాన్ని చూడటం లేదు. శరీరాన్ని చూసేవాడు ఛండాలుడు. వారే కనుక పండితులు అయితే వారు నా శరీరాన్ని చూడరు. ఎవడు పండితుడు అంటే కుక్కలో, గోవులో, మనిషిలో, దేవతలలో, రాక్షసులలో, కదిలే వస్తువులో, కదలని వస్తువులో అన్నింటిలోను ఒకే వస్తువును ఎవడైతే చూస్తున్నాడో వాడే పండితుడు. మొన్న మా ఇంటికి 85 సంవత్సరాలు ఉన్నవారు ఒకరు వచ్చారు. మీ వయస్సు ఎంత అని అడిగాను. 85 సంవత్సరాలు అని చెప్పి ఆయన వూరుకోలేదు, 85 సంవత్సరాలు వచ్చిన పిల్లవాడిని అంటున్నారు. అంటే 85 సంవత్సరాలు వచ్చినా నేను చేసుకొనే సాధన చేసుకొంటున్నాను, సాధన విడిచిపెట్టలేదు, నేను చేసుకొనే సత్కర్మ చేసుకొంటున్నాను. అంతేకాని చావు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూడటం లేదు, నేను జీవించి ఉన్న శవం లాగ బతకటం లేదు, నా పని ఏదో, నా సాధన ఏదో నేను చేసుకొంటున్నాను అని చెప్పటం. మీ ఇంట్లో పది మంది సభ్యులు ఉన్నారు అనుకో, ఆ పది మందిని నువ్వు ప్రేమిస్తావు, వారి అవసరాలు ఏమిటో చూస్తున్నావు, ఒక వేళ నీవు ఎర్ర బట్టలు కట్టుకొని ఇల్లు విడిచిపెట్టి బయటకు వచ్చేసావు అనుకో నీ ఇంట్లో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులను ఎలా చూసావో మొత్తం సృష్టిని అంతా ఇప్పుడు అలాగ చూడు, అది సన్యాసం. ఇంట్లో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులకోసం ఎలా పని చేసావో, బయటకు వచ్చాక సృష్టికోసం అలాగ పనిచెయ్యి. చేసేపని విసుగ్గా చేయవద్దు, అనురాగంతో చెయ్యి. కర్మను యోగంగా చెయ్యి, ఫలితం ఆశించకుండా నార్మల్‌గా, నేచురల్‌గా పని చెయ్యి. అలా నీవు పనిచేస్తూ ఉంటే చెట్టున ముగ్గిన పండు మనం కొట్టనక్కరలేకుండా ఎలా రాలిపోతుందో అలాగ నీవు అహంభావనలో నుండి బయటకు వచ్చేస్తావు, నాచురల్‌గా నార్మల్‌గా దేహాభిమానంలో నుండి బయటకు వచ్చేస్తావు. నీకు ఎప్పుడైతే దేహబుద్ధి పోయిందో అప్పుడు నీకు ఆత్మబుద్ధి కలుగుతుంది. మీరు సాధన చేస్తున్నా అది అజ్ఞానంలో నుండి విడుదలపొందటానికి సహరిస్తోందా, లేదా అనేది చూసుకోండి. నువ్వు చేసేపని వలన దేహాభిమానం తగ్గుతూ ఉంటే అప్పుడు పనిలో ఉన్న అందం నీకు కనిపిస్తుంది, పనిలో భగవంతుడిని చూడు. నువ్వు మంచిగా ఉండు, మంచి చెయ్యి అని శివానంద చెప్పేవారు. మంచి చెయ్యటం కంటే మంచిగా ఉండటం కష్టం. అహంభావన లేనివాడికి ఇష్టం ఏమిటి? అయిష్టం ఏమిటి? కోపం ఏమిటి? రాగం ఏమిటి? ద్వేషం ఏమిటి? ఈ పెంట అంతా ఎక్కడ ఉంది అంటే అహంభావనలో ఉంది.

పెంటమీద కూర్చుని వాసన వస్తోంది అనుకోవటం ఎటువంటిదో అహంభావనలో కూరుకుపోయి అశాంతి వస్తోంది, దుఃఖం వస్తోంది అనుకోవటం అటువంటిదే. పెంట మీద కూర్చొన్నవాడికి చెడ్డవాసన వస్తుంది కాని మంచివాసన ఎలా వస్తుంది. అలాగే దేహాభిమానంతో జీవించేటప్పుడు దుఃఖం వస్తుందికాని ఆనందం రాదు. నీ దేహప్రారబ్ధాన్ని బట్టి నీవు ఎక్కడ ఉన్నా నువ్వు ఆత్మజ్ఞానం పొందటానికి నీకు ఏ లోపాలు అడ్డువస్తున్నాయో జాగ్రత్తగా చూసుకొని అందులోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు ఎక్కడ ఉన్నావు అనేది ముఖ్యంకాదు. నీ అలవాట్లలో నుండి, బలహీనతలో నుండి ఎంత వరకు బయటకు వస్తున్నావు అనేది ముఖ్యం. నిన్ను ఏ విషయాలు అయితే బంధిస్తున్నాయో వాటిలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేసుకో. పశువును కట్రాడుకు కట్టేసినట్లు పూర్వజన్మ నుండి మోసుకొని వస్తున్న వాసనలు మనలను ఈ శరీరానికి కట్టేసి ఉంచుతాయి. ఈ శరీరం ముసలిది అయి చనిపోయింది అనుకో ఇంకో శరీరం వస్తుంది, కర్మ వాసనలు ఆ శరీరాన్ని పట్టుకొని ఉంటాయి. మీరు ఎక్కడ ఉన్నా ఆ వాసనలలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి, అదే సాధన. ఆత్మచింతన వలన అహంభావన తగ్గుతుంది, విషయచింతన వలన అహంభావన పెరుగుతూ ఉంటుంది. మీరు ఏది చింతిస్తున్నారో జాగ్రత్తగా చూసుకోండి. మీరు జ్ఞానం పొందటానికి ఏదో రూపం అడ్డువస్తోంది అనుకోండి, ఏదో నామం అడ్డువస్తోంది అనుకోండి. ఈ రూపం ఎవరు కల్పిస్తున్నారు, అహంభావన కల్పిస్తోంది, ఈ నామం ఎవరు కల్పిస్తున్నారు, అహంభావన కల్పిస్తోంది అని అర్థం చేసుకొని దానిలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 06-06-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నీరు ఒక్కటే దానిని అనేక భాషలలో అనేక రకాలుగా పిలుస్తారు. సత్యం ఒక్కటి అంటే ఒక్కటే. దానినే బ్రహ్మం అంటారు. ఈశ్వరుడు అంటారు, యెహోవా అంటారు, అల్లా అంటారు. ఇలా ఒకో మతంలో ఒకో రకంగా పిలుస్తారు కాని సత్యం ఒక్కటే, నీవు పొందవలసిన గమ్యం ఒక్కటే అది మీరు గుర్తు పెట్టుకొంటే మనస్సులో ఆందోళన రాదు, ఈ మతం కంటే ఆ మతం గొప్పది, ఆ మతం కంటే ఈ మతం గొప్పది అనేటువంటి తలంపులు అసలు మీకు రావు. సత్యం ఒక్కటే దానిని బౌద్ధులు నిర్వాణం అన్నారు. నిర్వాణం అంటే శాశ్వతంగా దుఃఖం లేకపోవటం. ఒకరోజు సంతోషంగా ఉండి, ఇంకో రోజు దుఃఖంగా ఉంటే అది నిర్వాణం కాదు. శాశ్వతంగా దుఃఖం లేకపోవటం నిర్వాణస్థితి. నిర్వాణస్థితి పొందినవాడికి కోరిక ఉండదు, వాడికి పునర్జన్మ

లేదు. హిందువులు మోక్షం అంటారు. మోక్షం అంటే సత్‌చిత్ ఆనందం అని, అంటే ఎప్పుడూ ఉండటం, ఆనందంగా ఉండటం, శాంతిగా ఉండటం. క్రైస్తవ మతంలో స్వర్గరాజ్యం అంటారు. సత్యాన్ని ఏమతం ఏ పేరుతో పిలిచినా హృదయంలో ఉన్న సత్యం ఒక్కటి అంటే ఒక్కటే. అది మనకు అనుభవంలోనికి వచ్చినప్పుడు శాశ్వతంగా శాంతి నిలబడుతుంది. మన కళ్ళకు కనిపించే ప్రపంచం అంతా నిజం కాదు, అది నిజం అనుకోవటం వలన భయం వస్తోంది, ఆందోళన వస్తోంది. స్వప్నం ఎందుకు పెట్టాడు అంటే మనకు మంచి స్వప్నాలు వస్తాయి, చెడు స్వప్నాలు వస్తాయి. స్వప్నం జరుగుతున్నంతసేపు ఆ స్వప్నం నిజం కిందే ఉంటుంది. మెలుకువరాగానే అబ్బే ఏమీ లేదు, ఇది అంతా అబద్ధం అనిపిస్తుంది. అలాగే ఈ జీవితం కూడా స్వప్నం లాంటిదే. మీ దేహప్రారబ్ధాన్ని బట్టి అదృష్టం వచ్చినా, దురదృష్టం వచ్చినా ఇది కూడా స్వప్నమే. ఆ స్వప్నం పొట్టిగా ఉంటుంది, ఇది పొడుగ్గా ఉంటుంది కాని అది ఎంత నిజం కాదో ఇది కూడా అంతే నిజంకాదు. ఇది మీకు కొంచెమైనా అర్థమవ్వకపోతే సాధన చేసినా మనస్సు అణగదు. స్వప్నంలో ఉన్నంత సేపు ఆ స్వప్నం నిజంకిందే ఉంటుంది అలాగే దేహాభిమానం ఉన్నంతకాలం ఈ సృష్టిలో జరిగే సంఘటనలు అన్నీ నిజంగానే ఉంటాయి. నిద్రలోనుండి మేల్కొన్నాక స్వప్నం అసత్యం అని ఎలా తెలుస్తుందో అలాగే నీ హృదయంలో మేల్కొన్నాక ఈ జగత్తు కూడా అసత్యమని నీకు తెలుస్తుంది. ఈ శరీరం మరణించక ముందే నీవు ఆ స్థితిని పొందితే ఇంక నీకు పునర్జన్మ లేదు.

కబీరుదాసు ఏమన్నాడు అంటే నీ హృదయంలో ఒక్కరికే చోటు ఉంది. ఎవడైనా ఒకడు అక్కడ కూర్చొన్నాడు అనుకోండి, మనం అక్కడ కూర్చోవాలి అంటే వాడిని లాగేయాలి కాని ఇద్దరు అక్కడ కూర్చోలేరు. నీ హృదయంలో అహంభావన కూర్చొంది అనుకోండి ఇంక దేవుడు రాడు ఎందుచేతనంటే వాడికి కూర్చోవటానికి అక్కడ చోటులేదు. మీ హృదయంలో దేవుడు కూర్చొన్నాడు అనుకోండి ఇంక అహంభావన రాదు. ఉంటే అహంభావన ఉండాలి లేకపోతే ఆత్మజ్ఞానం ఉండాలి. ఏది కావాలో మీరు చూసుకోండి. లోపల అహంభావన ఉంది అనుకోండి మీరు గుడులు చుట్టూ తిరిగినా, యాత్రలు చేసినా దేవుడు రాడు. మనం జపాలు చేసి, ధ్యానాలు చేసి, సాధనలు చేసి హృదయంలో నుండి అహంభావనను కనుక ఖాళీ చేస్తే మరుక్షణంలో ఈశ్వరుడు అక్కడ కూర్చొంటాడు. మీ హృదయంలో ఎవరు కూర్చొన్నారు జాగ్రత్తగా పరిశీలన చేసుకోండి అన్నాడు కబీరుదాస్. మీ కటుంబ పరిస్థితులు ఎప్పుడూ ఒకరకంగా ఉండవు. వివేకానంద తండ్రి బతికి ఉండగా భోగం అనుభవించాడు, తండ్రి చనిపోయిన తరువాత తిండికి, బట్టకు కూడా ఇబ్బంది పడ్డాడు. అనేక కష్టాలను అనుభవించి

ఆయన ఒక మాట చెప్పాడు. సమాజ పరిస్థితులు కాని, మీ కుటుంబ పరిస్థితులు ఎప్పడూ ఒక రకంగా ఉండవు. మంచిప్రారబ్దం రావచ్చు, చెడుప్రారబ్దం రావచ్చు, అంతా ఈశ్వరసంకల్పం ప్రకారం జరుగుతుంది. మీ దేహప్రారబ్దమును బట్టి అదృష్టం వచ్చినా, దురదృష్టం వచ్చినా, సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా అది ఎప్పడూ ఉండదు, అవి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. పరిస్థితులు మీ చేతిలో లేకపోయినా ప్రవర్తన మీ చేతిలో ఉంది. ఈ పరిస్థితులన్నింటి మధ్యలో, ఇవన్నీ చూస్తూ మీ ప్రవర్తనను కాపాడుకోండి అని చెప్పాడు. మా నాన్నగారు బతికి ఉండగా మా ఇంటి చుట్టూ తిరుగుతూ, మా నాన్నగార్ని స్తోత్రం చేసిన వాళ్ళే మా నాన్నగారు చనిపోయిన తరువాత మామీద దావాలు వేసారు. ఆ దావాలు వేసినవారు ఎప్పడైనా రోడ్డుమీద కనబడితే నాకు కొంచెం కోపం వచ్చేది. వాడిని దావా చేయవద్దు అని చెప్పినా వాడు మానడు. నా కోపాన్ని కంట్రోలు చేసుకోవటం నేర్చుకోవాలి కదా అనుకొన్నాను అని వివేకానంద చెప్పారు. వాడిని నేను ఎలాగ మార్చలేను, వాడిని చూసి నేను పాడైపోవటం కంటే సాధన చేసుకొంటూ నా నిదానంలో నేను ఉండటం మంచిది అనుకొన్నాను అని వివేకానంద చెప్పారు. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు, వాటిని చూసి తొందరపడి మన ప్రవర్తన మార్చుకోకూడదు. మన ప్రవర్తన సరిగా లేకపోతే ఉద్రేకం వస్తుంది, కోపం వచ్చేస్తుంది, లోపల కుళ్ళిపోతాము.

మీరు ఎక్కువగా స్నేహాలు చేయవద్దు, తగుమాత్రంగా చేయండి. ఎక్కువగా స్నేహం చేసి మీ గుండెకు హత్తుకోవద్దు. ఎందుచేతనంటే వాడు మీకు శత్రువు అయ్యాడు అంటే వెంటనే మీకు దుఃఖం వచ్చేస్తుంది. ఎవడైనా మీకు శత్రువు ఉన్నా వాడిని మీరు ద్వేషించవద్దు, దాని వలన మనస్సు బాహ్యముఖానికి పోతుంది, మన ప్రవర్తనలో తేడా వచ్చేస్తుంది. అందుచేత మీరు ఉదాసీనంగా ఉండి మీ పని ఏదో మీరు చూసుకోండి. మనకు మంచివారు గురువులే, చెడ్డవారు కూడా గురువులే. మంచి వారిని చూసి నేర్చుకొనేది ఉంటుంది. చెడ్డవారు ఎందుకు గురువులు అంటే మా జోలికి రావద్దు అని వారు చెపుతున్నారు. మీకు ఏదైనా నష్టం వచ్చింది అనుకోండి, మీ మనస్సులో కుంగు రాకూడదు. మీరు ధనవంతులు అయినా మాయే, మీరు ఇంటి దగ్గర ఇబ్బందులు పడుతూ ఉన్నా అది కూడా మాయే. మీకు ఏదైనా లాభం వచ్చి మీరు పొంగిపోయినప్పడు కూడా మీ మనస్సులో ముద్రలు పడతాయి. మీకు నష్టం వచ్చి మీరు కుంగిపోయినప్పడు మీ మనస్సులో ముద్రలు పడతాయి. లాభనష్టములు మీ కూడా రావు కాని మనస్సులో పడిన ముద్రలు, ఆ వాసనలు మీరు చనిపోయాక మీ కూడా వచ్చేస్తాయి, ఇది మీరు అర్థం చేసుకోండి. శరీరానికి సంబంధించిన ఎక్సర్‌సైజులే యోగం అని కొంతమంది

అనుకొంటున్నారు. మీ జీవితంలో జరిగే సంఘటనల ప్రభావం మీ మీద పడకుండా చూసుకొంటే మీ బుద్ధి నిర్మలంగా ఉంటుంది, నిశ్చలంగా ఉంటుంది, సమానంగా ఉంటుంది. సమాన బుద్ధి కలిగియుండటమే యోగం అని పరమాత్మ చెపుతున్నాడు, అప్పుడు మీకు పునర్జన్మ హేతువులు నశిస్తాయి. ఈ జీవుడు నిజంకాదు, నీకు వందకోట్లు డబ్బు ఉంది అనుకో అదీ నిజం కాదు, నీవు తిండికీ బట్టకీ ఇబ్బంది పడుతున్నావు అనుకో అదీ నిజం కాదు. ఇవి ఎంత నిజం కాదో అంత నిజంలాగ నీకు కనిపిస్తున్నాయి కాబట్టి హెచ్చు తగ్గులకు, కష్టనష్టాలకు గురి అవుతున్నావు, బాహ్యమైన పరిస్థితులకు లొంగిపోతున్నావు. నిన్ను నీవు బేలెన్స్ చేసుకో, నీ మనస్సును ఎప్పుడూ సమానంగా ఉంచుకో, అదే యోగం.

శాస్త్రంలో విషయ కామం, ఈశ్వర కామం అని చెపుతారు. కామం అంటే కోరిక. విషయాల మీద కోరిక ఉంటే అది విషయ కామం. ఈశ్వరుడిని పొందాలి అనే కోరిక ఉంటే అది ఈశ్వరకామం. విషయ కామం ఉన్నవాడు ఆజన్మకు ఆ జన్మ పతనమయి పోతాడు, నీచమైన జన్మలలోనికి వెళ్ళిపోతాడు. ఈశ్వరుని పొందాలి అనే తపన నీకు ఉంటే ఆయన నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. ఈశ్వరుడు నీకు స్వరూపంగా వ్యక్తమైనప్పుడు ఈశ్వర కామం అణిగిపోతుంది. పని పనికోసం చేస్తే కర్మ నిన్ను చుట్టుకోదు. మనం చేస్తే ఇష్టంగా చేస్తాము లేకపోతే అయిష్టంగా పని చేస్తాము అందుచేత కర్మ మనలను చుట్టుకొంటుంది. ఇష్టానికి, అయిష్టానికి మనం దూరంగా ఉండలేకపోతున్నాము, అది మనం నేర్చుకోలేకపోతున్నాము. ఓ అరుణాచలేశ్వరుడా! ఏ విద్యను నేర్చుకొంటే నువ్వు నాకు తెలుస్తావో అటువంటి విద్యను నాకు నేర్పించు. ఈ భౌతిక విద్యలు అన్నీ జిమ్మిక్కులు, మేజిక్కులు. ఇవి పొట్టకీ, గౌరవం తెచ్చుకోవటానికి బాగానే ఉంటాయి, సన్మానాలు మిగులుతాయి, అసలు సున్న. ఈ జిమ్మిక్కులలో నుండి నన్ను విడుదల చేసి, ఏ విద్య నేర్చుకొంటే ఈ మోహంలో పడకుండా, నీ మోహంలో పడి నిన్ను తెలుసుకొనే శక్తి నాకు కలుగుతుందో అటువంటి విద్యను నాకు నేర్పించు అంటున్నారు భగవాన్. పెద్ద తాచుపాము వచ్చి మనల్ని కరిచేస్తుంది అనుకోండి, దానివలన పెద్ద ప్రమాదం ఏమీ లేదు, ఈ శరీరం ఒక్కటే చనిపోతుంది, మరల కొత్త శరీరం వస్తుంది. మాయా విషం అలా కాదు పాము విషం కంటే చాలా ప్రమాదం. మాయా విషం కొన్ని కోట్ల జన్మలు తిప్పేస్తుంది, మామూలు జన్మలు అయినా ఫరవాలేదు నీచమైన జన్మలు వస్తాయి. మాయా విషం తలకెక్కి నేను శుభ్రంగా పాడవ్వకముందే నువ్వు నన్ను రక్షించు అరుణాచలేశ్వరా అన్నారు భగవాన్. ఇప్పుడు మీరు ఎవరినైనా ప్రేమిస్తున్నారు అనుకోండి, మీ కూతురునుగాని, మీ భర్తనుగాని, మీ మనవళ్ళి గాని ప్రేమిస్తున్నారు అనుకోండి, అది వాళ్ళ

కోసం వారిని ప్రేమిస్తున్నారా? మీ కోసం వాళ్లని ప్రేమిస్తున్నారా? ఇది ఇంటిదగ్గర ప్రశాంతంగా కూర్చొని ఆలోచించుకోండి. వాళ్ల కోసం వారిని ప్రేమించటంలేదు, మీ కోసమే వాళ్లని ప్రేమిస్తున్నారు. ఎందుచేతనంటే వారికి మీకు ఏదైనా పేచీ వచ్చింది అనుకోండి. మీరు వారిని వదిలేస్తారు, తల్లి కొడుకుని వదిలేస్తుంది, కొడుకు తల్లిని వదిలేస్తాడు, తల్లీ కొడుకులు అనేక మంది దావాలు వేసుకొన్నవారు ఉన్నారు. మీ కోసమే మీరు ఇతరులను ప్రేమిస్తున్నారు. మీలో ఉండి ఆ ప్రేమించే వాడు ఎవడు? ఆ నేను ఎవడు? ఇది బాగా అర్థం చేసుకోండి. నీకు మొదట నేను అనే తలంపు వచ్చాకే అన్ని తలంపులు వస్తున్నాయి. ఏది వచ్చాక అన్నీ వస్తున్నాయో అది తెలియకుండా నీకు జ్ఞానం రాదు. ఒకవేళ నీవు రెండు కళ్లతోటి దేవుడిని చూసినా, ఒకవేళ నీకు రాముడు కనిపించినా నీకు వరాలు ఇవ్వవచ్చు, ఆ వరాలు నీవు అనుభవించవచ్చు. ఇక్కడ మనం కూర్చొని మాట్లాడుకోవటం ఇది ఎంత నిజమో ఆ వరాలు కూడా అంతే నిజం కాని అది నగ్నసత్యం కాదు. ఆ ఇచ్చినవాడు ఎంత నిజమో, అనుభవించేవాడవు నువ్వు కూడా అంతే నిజం. మనకు వివేకం లేదు, సహనం లేదు అందుచేత సబ్జక్టు అర్థం చేసుకోలేకపోతున్నాము. చెప్పిన మాట అర్థం చేసుకోవటానికి సహనం ఉండాలి, వివేకం ఉండాలి. ఎవరైనా మిమ్మల్ని గౌరవించినప్పుడు ఒక రకంగా ఉంటారు, అగౌరవ పరచినప్పుడు ఒక రకంగా ఉంటారు. ఈ గౌరవాలు అగౌరవాలు కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. వాటివలన మీరు లోపల పొందిన స్పందనలు, వికారాలు మటుకు వచ్చే జన్మకు వచ్చేస్తాయి. మరల చాలా కష్టపడి సాధన చేస్తేనే కాని అవి పోవు.

కర్మ, ఉపాసన, జ్ఞానం. ఇక్కడ మన తెలివితేటలు ముఖ్యం కాదు. భగవంతుడు ఏ పని అయితే చేయవద్దు అని చెప్పాడో ఆ పని మానివేయటమే. నువ్వు ఎవరినీ ద్వేషించవద్దు అని చెప్పాడు అంటే ద్వేషించటం మానివేయటమే. స్నేహాలు అతిగా ఉండకూడదు అని చెప్పాడు. అంటే ఎవరితోను అతిగా ఉండటం మానివేయటమే. భగవంతుడు ఏదైతే చేయమని చెప్పాడో అది మనం చేయటమే. ఏదైతే వద్దని చెప్పాడో అది మానివేయటమే. ఈ పని ఎందుకు చేయమన్నాడో, ఆ పని ఎందుకు వద్దు అన్నాడో అది భగవంతుడికి తెలుస్తుంది కాని మన బుర్రకు అందదు. జీవుడు సర్వజ్ఞుడు కాదు, ఈశ్వరుడు సర్వజ్ఞుడు. పది రోజులు మీరు పని పనికోసమే చెయ్యండి. ఇష్టంగా ఉండవద్దు, అయిష్టంగాను ఉండవద్దు, అప్పుడు మీ మనస్సు చల్లారిపోతుంది. ఉపాసన అంటే మీకు ఏ దేవుడు ఇష్టమైతే ఆ దేవుడి యొక్క నామాన్ని స్మరించుకోవటం, ఆయన రూపాన్ని ధ్యానించుకోవటం అదొక పద్ధతి. మీకు నేను అనే తలంపు వస్తోంది కదా. అది ఎక్కడ నుండి అయితే వస్తోందో అక్కడ దానిని నిలబెట్టి ఉంచటం, అంటే

మీరు మెదడులో ఎంత సహజంగా ఉంటున్నారో అంత సహజంగా హృదయంలో ఉండగలగాలి, అది కూడా ఉపాసనే. మనస్సు హృదయంలో ఉంటే దానికి విషయచింతన ఆగిపోయి నెమ్మదిగా నశిస్తుంది. నామజపం వలన, రూప ధ్యానం వలన రజోగుణం తగ్గిపోయి సత్వగుణం పెరుగుతుంది. సత్వగుణం మీకు జ్ఞాన మార్గాన్ని చూపించి అది ప్రక్కకు తప్పుకొంటుంది. అవి ఉపాసన వలన లాభాలు. చెయ్యవలసిన సత్కర్మ చేసాక, మీరు ఉపాసన చేసాక ఫైనల్‌గా మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీకు ఆత్మజ్ఞానం కలిగే వరకూ ఈ కర్మ విడిచిపెట్టదు, దేహం విడిచిపెట్టదు, బంధం విడిచిపెట్టదు, పుణ్యాలు పాపాలు విడిచిపెట్టవు, బాహ్యాఆకర్షణలు మిమ్మల్ని విడిచిపెట్టవు.

నాకు భయం వేస్తోంది అని ఈరోజు ఎవరో వచ్చి నన్ను అడిగారు. గాఢనిద్రలో మీకు భయం లేదు. జాగ్రదవస్థలోనికి వచ్చాక మీకు భయం వస్తోంది. గాఢనిద్రలో మీకు నేను అనే తలంపు లేదు. అది లేనప్పుడు ఏ గొడవ లేదు. జాగ్రదవస్థలో నేను అనే తలంపు వచ్చాక ఇతరులు వస్తున్నారు. ఇతరులను చూస్తే మీకు భయం వేస్తోంది. ఈ నేను అనే తలంపు ఎంత నిజమో ఇతరులు కూడా అంతే నిజం నీకు వచ్చే భయం కూడా అంతే నిజం. ఈ నేను అనే తలంపే నిజంకాదు అని నీకు అర్థమైంది అనుకో ఇంక ఇతరులు లేరు, నీకు భయం ఇక్కడే అణిగిపోతుంది. ఏది వచ్చాక అంతా వస్తోందో తెలుసుకొని అందులో నుండి విడుదల పొందు. దానిలో నుండి విడుదల పొందితే అదే కడసారి జన్మ. మనం ఎవరికైనా సలహా చెపుతాము అనుకోండి. వారు వినరు అనుకోండి వెంటనే మనం కోపం తెచ్చేసుకొంటాము, అక్కడ నుండి మన పతనం ప్రారంభమవుతుంది. అలాకాదు, మనం ఎవరికైనా మంచి చెప్పాలంటే చెప్పవచ్చు, మనం మనంలాగ ఉండి చెప్పాలి. వాళ్ళు వినరు అనుకోండి మనం వికారం తెచ్చుకోకూడదు. అంతేకాని మేం చెప్పినట్లు వాళ్ళు వినటం లేదు, మేము చెప్పినట్లు వారు చెయ్యాలి అంటే మరల మాయలో పడిపోతాము. నేను చెడు సహవాసాలలో పడకముందే, లౌకికుల మాయలో పడకముందే నువ్వు నాయందు దయ చూపించి, నన్ను రక్షించు అంటే నేను చెడుస్నేహాలు చేసి బుద్ధి పాడుచేసుకొన్నాను అనుకో, ఆ స్నేహితుల మాట వినాలనిపిస్తుంది, కాని నీవు నాకు యజమానివి అయినా కూడా నీమాట నాకు వినాలనిపించదు. అందుచేత దుష్ట సహవాసం చేయకముందే నన్ను రక్షించు అరుణాచలేశ్వరుడా! అన్నారు భగవాన్. గౌడపాదుడు ఏమన్నాడు అంటే అసలు ఈ జీవుడు పుట్టలేదు. ఈ పుట్టుక అబద్ధం, చావు అబద్ధం, నువ్వు అనుభవించే కష్టసుఖాలు అబద్ధం. నీకు చైతన్యం గురించి తెలియకపోవటం వలన వచ్చిన గందరగోళం ఇది అంతా. అది తెలిసాక ఇది ఏమీ లేదు, అంతా సున్న అని నీకు

తెలుస్తుంది అని చెప్పాడు. జీవుడు అంటే శాస్త్రంలో ఏమి చెప్పారు అంటే మన ముందు అద్దం పెడితే మన ప్రతిబింబం అక్కడ కనిపిస్తుంది. అలాగే ఉన్న వస్తువు బ్రహ్మమే అంతఃకరణం అనే అద్దంలో జీవుడిలా కనిపిస్తున్నాడు. అద్దం ఏవిధంగా అయితే నీ ప్రతిబింబం కనబడటానికి ఉపయోగపడుతుందో అలాగే అంతఃకరణం ద్వారా భగవంతుడు ప్రతిబింబిస్తున్నాడు, ఆ ప్రతిబింబమే జీవుడు. అద్దం పగిలిపోయింది అనుకోండి ఇంక ప్రతిబింబం లేదు, మీరు పోరు కాని ప్రతిబింబం పోతుంది. అలాగే అంతఃకరణం నశిస్తే జీవుడు లేడు. నువ్వు నువ్వుగానే ఉన్నావు కాని ప్రతిబింబాన్ని చూసి నువ్వు అనుకొంటున్నావు. అది నువ్వు కాదు, నీనీడ మాత్రమే. అది నీకు అర్థమైతే జీవుడు నశిస్తాడు. ఈ జీవకోటి అంతా నీడలే. దేహవాసన, లోకవాసన మనిషిని పీడించేస్తాయి. లోకవాసన ఉన్న వాడికి ఎంత సేపు గొప్పలు కావాలి, వారిని వారు పొగుడు కొంటారు, ఇతరులను తిడుతూ ఉంటారు. దేహవాసన ఉన్న వాడికి 24 గంటలు దేహం గొడవలే. దేహం ఉంది కాబట్టి కొంచెం అన్నం పెట్టాలి, ఏదో బట్టకట్టాలి మీ పని ఏదో మీరు చూసుకోవాలి. అంతేగాని అస్తమాను దేహం గొడవలో ఉండకూడదు. దేహం కారు టైరు లాంటిది. టైరుకు పేచ్చీ పడింది అనుకోండి, ఆ పేచ్చీ వేయించుకొని మరల కారుకు తగిలించుకొని తిప్పకొంటాము. అలాగే దేహానికి రోగం వస్తే మందులు వేసుకొని ఆ రోగం తగ్గించుకొని ఈ దేహాన్ని ఆత్మజ్ఞానం పొందటానికి ఉపయోగించుకోవాలి. ఇక్కడ విన్న విషయాలను ఇంటికి వెళ్లి శ్రద్ధగా వాటిని మీ మనస్సులో తిప్పకొంటే, మీ బుద్ధికి అర్థమయ్యేలాగ చేసుకొంటే అప్పడు మీరు బాగుపడతారు. మీరు బాగుపడటానికి ఎవరు సహకరిస్తున్నారు, మీ దేహం సహకరిస్తోంది. మీ దేహాన్ని అలాగ ఉపయోగించుకోండి. మీకు దేహం ఉంది కాబట్టి ఇక్కడకు వచ్చి శ్రవణం చేస్తున్నారు. దేహం చనిపోయిన తరువాత జిన్నూరు రాగలరా. అందుచేత దేహం ఉండగానే ఈ దేహాన్ని ఉపయోగించుకోండి. మీకు సబ్జక్టు సరిగా అర్థమైతే, అది సరిగ్గా మీ మెదడుకు పడితే మీకు నిర్వాణస్థితి వచ్చేస్తుంది. అప్పడు ఎదుటి వారు మిమ్మల్ని చెడగొట్టాలన్నా అది ఆగదు. రైలు వెళుతోంది అనుకోండి ఏదో గొర్రె అడ్డు వస్తే రైలుకు నష్టం ఏమిటి? ఆ గొర్రె పోతుంది. మీలో చెడువాసనలు ఉన్నా మీరు సత్కర్మ చేస్తూ ఉంటే, విచారణ చేస్తూ ఉంటే, ఆ వాసనల వలన వచ్చే నష్టం గ్రహిస్తూ ఉంటే, ఆత్మజ్ఞానం యొక్క వైభవం శ్రవణం చేస్తూ ఉంటే, సబ్జక్టు మీకు అర్థమైనప్పడు ఆ ప్రవాహ వేగంలో ఈ వాసనలు అన్నీ కొట్టుకొనిపోతాయి.

అరుణాచలేశ్వరుడు దేవుడు దేవుడు అని అందరూ చెప్పకొంటూ ఉంటే నేను వచ్చాను. తీరా వచ్చాక నీవు ఏమి చేసావు. నా దేహాన్ని నాకు కాకుండా చేసావు. అది నువ్వు కాదు, అది

నువ్వు కాదు అంటూ నన్ను దిగంబరుడిని చేసావు. ఏదో గొప్ప గౌరవం తీసుకొని వస్తావు అనుకొన్నాను, అవన్నీ సున్నా చేసావు. దేహమే ఆత్మ, దేహమే సర్వస్వం అనుకొనే బుద్ధిని నాశనం చేసావు. అనాత్మ గొడవలు అన్నీ తీసేసి నా హృదయం అంతా అమృతంతో నింపావు. ఇది అంతా నాకు తెలియకుండా చేసేసావు. నాకు తెలియాలి అని నీవు అనుకోవటం లేదు. అయితే ఏదో రమణస్వామికి చేసేసాము నాపని అయిపోయింది అనుకోకు, నా బోటి వారు అనేకమంది నీ దగ్గరకు వస్తారు, వారికి కూడా ఆ స్థితిని ప్రసాదించు అరుణాచలేశ్వరుడా అన్నారు రమణస్వామి. మీరు ఇంటి దగ్గర కుటుంబ సభ్యులతో కూడా భాష బాగా మాట్లాడండి, ఎవరినీ దున్నపోతు అని అలా అనకండి. భాష సరళంగా, సౌమ్యంగా ఉండాలి. భాష బాగా మాట్లాడుతూ ఉంటే మీకు మంచి ఆలోచనలు వస్తాయి. మీరు ఇంట్లో వారిని అస్తమానుదున్నపోతు, దున్నపోతు అంటే మీరు దున్నపోతుకింద అయిపోతారు. మీరు చెప్పే భాష బాగుంది అనుకోండి మీరు ఎవరిని బాగు చెయ్యాలి అనుకొంటున్నారో వాడు ఎంతోకొంత బాగుపడతాడు, మీరు బాగుపడతారు. మీరు మాట్లాడే భాష సౌమ్యంగా, సరళంగా లేదు అనుకోండి, హితవుగా లేదు అనుకోండి మీ భాష విన్నవారు పాడవుతారు, మీరు పాడవుతారు. అందుచేత మాట్లాడే మాట చక్కగా ఉండాలి, సంస్కరింపబడిన భాష మాట్లాడాలి. పనిపట్ల శ్రద్ధగా ఉండండి, ఫలితం పట్ల వద్దు, వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు, మీ డ్యూటీ మీరు చెయ్యండి, కొంతమంది సంతోషిస్తారు, మీరు శ్రద్ధగా చేసినా కొంతమంది సంతోషించరు. ఆ గొడవ వదిలివేయండి, మీ నిదానంలో మీరు ఉండండి. ఇప్పుడు మనం అన్నం తిన్నాము అనుకోండి దాని శక్తి సాయంత్రం వరకు పనిచేస్తుంది. అలాగే నువ్వు ఒక అరగంట పూజ చేస్తే, ఒక అరగంట జపం చేస్తే, ఒక అరగంట ధ్యానం చేస్తే 24 గంటలు ఆ శక్తి పనిచేస్తుంది. నువ్వు ఇంకా ఇంకా లోపలకు వెళ్ళావు అనుకో నిర్గుణం అయిపోతావు, అసలు ప్రపంచం ఉంది అని కూడా నీకు తెలియదు. నువ్వు రోజూ చేసే సాధన నిజమో కాదో చూసుకోవాలి. అది ఎలా తెలుస్తుంది అంటే ఇంతకుముందు నువ్వు ఎవరినైనా ద్వేషిస్తున్నావు అనుకో నవ్వు చేస్తున్న సాధన నిజం అయితే ఆ ద్వేషం చల్లారిపోతుంది. బయట వస్తువుల పట్ల, బయట సంఘటనల పట్ల, బయట వ్యక్తుల పట్ల నీ దృక్పథమే మారిపోతుంది. సాధన యొక్క వైభవం అటువంటిది. మీ ఇంటికి దురదృష్టం వస్తే ఏదో పోయింది అని మీకు అనిపించదు. మీకు అదృష్టం వస్తే ఏదో వచ్చిపడిపోయింది అని కూడా మీకు అనిపించదు. ఇదంతా సాధనాబలం వలన వస్తుంది. మీకు సాధనాబలం లేకపోతే అదృష్టం వస్తే పొంగిపోతారు, దురదృష్టం వస్తే డిప్రెషన్‌లోనికి వెళ్ళిపోతారు.

న్యూటన్‌కు ఆయన పెంచుకొనే పిల్లి అంటే చాలా ఇష్టం. న్యూటన్ ఫిజిక్స్ మీద 500 పేజీలు నోట్స్ వ్రాసుకొన్నాడు. ఆయన వాకింగ్‌కు వెళ్ళినప్పుడు ఆ పిల్లి టేబుల్ మీదకు ఉరికింది. అక్కడ ఉన్న కొవ్వొత్తి పుస్తకం మీద పడి పుస్తకం కాలిపోయింది. వాళ్ళు ఎంత ఓర్పు గలవారో చూడండి. ఆ పిల్లిని ఆయన తిట్టలేదు, కొట్టలేదు. చేతిలో గ్లాసు పొరపాటున పడితేనే మనం ఇంట్లోని వారిని పట్టుకొని తిడతాము. ఆయనకు పిల్లిమీద కోపం రాలేదు. అయ్యో పిల్లి ఎంత పని చేసావు అనుకొన్నాడు. మరల కష్టపడి నోట్సు వ్రాసుకొన్నాడు. ఇది మీకు ఎందుకు చెపుతున్నాను అంటే అంత ఓర్పు, సహనం వారికి లేదు అనుకోండి, హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళలేరు, కొత్త విషయాలు కనిపెట్టలేరు. కొత్త విషయాలు కనిపెట్టి వాడు సంపాదించినది ఏమీ లేదు, లోకం సుఖపడుతోంది. కొంతమందికి స్వభావంలో తేలికతనం ఉంటుంది, మెదడు అంతా విషంతో నిండి ఉంటుంది. వారు కొత్త విషయాలు తెలుసుకోలేరు. మనం సాధనలు చేసినా మన మనస్సులో కనుక నీచత్వం ఉంటే మనకు జ్ఞానం కలుగదు. మన శరీరం ఏదో టైములో వచ్చింది, ఏదో టైములో పోతుంది, మనకు ఏదో టైములో దుఃఖం వస్తుంది, అది ఏదో టైములో పోతుంది. వీటన్నింటిని మాత్రలు అంటారు. ఒకకాలంలో ఉంటుంది ఇంకోకాలంలో ఉండదు. ఈ మాత్రలతో సంబంధం లేకుండా అమాత్ర ఒకటి ఉంది. అదే బ్రహ్మం. అది తెలుసుకోవటానికే మనం ఈ భూమి మీదకు వచ్చాము, వచ్చిన పని మర్చిపోవద్దు. అక్కడికి వెళ్ళు, అక్కడికి వెళ్ళు, అది నీ హృదయంలోనే ఉంది. కొంతదూరం వెళ్ళి వెనక్కి వచ్చేయకు. నీ హృదయంలో ఉన్న బంగారం దొరికే వరకు అక్కడకు వెళ్ళు. అదే సాధన. జ్ఞానం పొందినవాడు ఎలాగైనా శాంతిగానే ఉంటాడు. వాడి దర్శనం వలన మనకు ప్రయోజనం ఏమిటి అంటే మనకు మంగళాలు జరుగుతాయి అంటే శుభాలు కలుగుతాయి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 11-07-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు గురుపూర్ణిమ. దీనినే వ్యాసపూర్ణిమ అంటారు. వ్యాసుడు శరీరం తీసుకొన్న రోజు, ఆయన విష్ణువు యొక్క అంశ అని చెపుతారు. మునులలో వ్యాసుడను నేను అని పరమాత్మ చెప్పాడు. వేదాలలో ఉన్న సారాన్ని గ్రహించి దానిని మననం చేసేవాడిని ముని అంటారు. భగవద్గీత మనం చదువుతూ ఉంటే అది మనకు అర్థం కాకపోతే అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి కాని దానిని సవరణ చేయటానికి మనకు అవకాశం లేదు. మన తెలివితేటలు ఎంత వరకు వచ్చాయి అంటే భగవద్గీతకు సవరణ చేయటానికి సిద్ధమవుతున్నాము అంటే అది మనం పాడైపోయాము అనటానికి గుర్తు. సన్యాసం అంటే

సమగ్రంగా విడిచిపెట్టటం. మనం ఏదిగా ఉన్నామో అందులో ప్రవేశించాలంటే 1. కీర్తి కాంక్ష పూర్తిగా విడిచిపెట్టాలి, 2 ధనకాంక్ష ఉండకూడదు, 3. సంసారం మీద మమకారం ఉండకూడదు. ఈ మూడు సమగ్రంగా విడిచిపెట్టిన వాడిని సన్యాసి అంటారు. గురువు లేని విద్య గుడ్డివిద్య అంటారు. మనం పుస్తకాలు చదివిన దానికంటే గురువు ముఖతః నేర్చుకోవటం మంచిది. మనం అవతారపురుషులు అనుకొనేవారు, పెద్దలు అనుకొనేవారు అందరూ కూడా గురువు ముఖతః నేర్చుకొన్నారు. కృష్ణుడు అంటే స్వయంగా భగవంతుడు, సాంప్రదాయం కోసం ఆయన గురువులను పెట్టుకొన్నాడు. రమణమహర్షి గారికి గురువు శరీరంతో లేకపోయినా, అరుణాచలేశ్వరుడే ఆయనకు గురువు. అజ్ఞాన అంధకారాన్ని తొలగించేవాడు గురువు అని అర్థం. గురువులో ఏ ఆనందం అయితే ఉందో అది మీలోను ఉంది. గురువు ఏ ఆనందాన్ని అయితే అనుభవిస్తున్నాడో ఆ ఆనందం మీరు కూడా అనుభవించటానికి మీలో ఏవైతే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించటానికి గురువు ప్రయత్నం చేస్తాడు. గురువు మనతో మాట్లాడుతూ ఉంటాడు, మనతో కలిసి తిరుగుతాడు, మన జీవితాన్ని ఎప్పుడో సడన్‌గా మలుపు తిప్పి ఆనందసాగరంలో ముంచేస్తాడు. గురువు మనకు చేసే ఉపకారం శాస్త్రం కూడా వర్ణించలేదు, అది మన మాటలకు అందేది కాదు. జన్మాంతరంలో నుండి వచ్చిన వాసనలను బట్టి ఒక్కొక్కడి మనస్సు ఒక్కో విషయం మీద వాలుతూ ఉంటుంది. ఆ విషయం మీద నుండి మీ మనస్సును మళ్ళించే శక్తిని గురువు నీకు ప్రసాదిస్తాడు. ఆత్మచింతన, దైవచింతన, గురుచింతన తప్పించి మీరు ఏది చింతించినా అవి మీకు పునర్జన్మలకు కారణాలవుతాయి. ఇతర విషయాలను చింతించకుండా మిమ్మల్ని అడ్డుకొని, మీ మనస్సును ఆత్మమీద నిలబడేటట్లు చేసేవాడే గురువు. ఆత్మచింతన తప్పించి ఏ చింతన చేసినా, అది ఏ రూపంలో చేసినా శిక్ష వడ్డీతో సహా చెల్లించవలసిందే. నేను చెప్పే మాటలు మీకు నచ్చటం లేదు అనుకోండి, మీరు ఇష్టపడటం లేదు అనుకోండి, వాటిని ఊసేయకండి, హితవు చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. ఎందుచేతనంటే అవి మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు నాన్నగారు ఫలానారోజున చెప్పారు అని మీకు తెలుస్తుంది. కేవలం బ్రహ్మచింతన మంచిదే కాని అందరూ చెయ్యలేరు, దానికి అందరికి అర్హత ఉండదు. బ్రహ్మచింతన చేయలేకపోతే గురుచింతనగాని, దైవచింతనగాని చేయటం వలన మనస్సు నశిస్తుంది. ఎవడు బుద్ధిమంతుడు అంటే ఒకవేళ వాడికి దుష్ట సహవాసం ఉన్నప్పటికీ ఆ దుష్టుడి యొక్క ప్రభావం వాడి మీద పడకుండా, వాడి గుణం వాడు పోగొట్టు కోకుండా ఉన్నవాడు బుద్ధిమంతుడు. మీరు బుద్ధిమంతుల దగ్గర కూర్చొన్నా, కాశీ రామేశ్వరం వెళ్ళినా, ఒకో గంట మౌనంగా కూర్చొన్నా, పూజలు చేస్తున్నా, ఒక

రోజో, రెండు రోజులో బాగుంటుంది. కాని ఈ రకంగా పూర్తిగా దుఃఖం నశించదు. దేహమే ఆత్మ, దేహమే సర్వస్వం అనుకొనే బుద్ధి నీలో ఎంతకాలం ఉంటుందో అంతకాలం, మనిషి కూడా నీడ ఎలాగ వస్తుందో అలాగ దుఃఖం నిన్ను వెంటాడుతుంది. దేహాత్మబుద్ధి ఎవడికైతే నశిస్తుందో వాడికి దుఃఖం నశిస్తుంది, వాడు నిర్వాణ స్థితిని పొందుతాడు. సజ్జన సాంగత్యం చేయటం, పెద్దలకు సేవ చేయటం, జపం చేయటం, ధ్యానం చేయటం ఇవన్నీ కూడా దేహాత్మబుద్ధి నశించటానికే, ఆ గమ్యం చేరుకోవటానికే అని మీరు మర్చిపోకూడదు. మీకు దేహాత్మ బుద్ధి నశించిందా లేదా అని గురువు చూస్తూ ఉంటాడు. గురువు అంటే ఆత్మ, మనలో అంతర్యామిగా ఉన్నాడు. మనం కానిది అవును అనుకొంటున్నాము, ఏదైతే అవునో అది కాదు అనుకొంటున్నాము, మనలో ఈ తిరకాసు ఉందని గురువుకు తెలుసు. వీరు జపాలు చేస్తున్నారు, ధ్యానాలు చేస్తున్నారు కాని ఈ తిరకాసులో నుండి, ఈ అడవిలో నుండి బయటకు రాలేదు అని ఆయన చూస్తూ ఉంటాడు. ఈ అడవిలో నుండి మిమ్మల్ని బయటకు తీసుకొని వచ్చే వరకూ రాబోయే జన్మలో కూడా మిమ్మల్ని విడిచిపెట్టదు, వాడి లక్ష్యం అదే, వాడే గురువు. ఒకవేళ మీరు గురువును నిందించినా ఆయన మిమ్మల్ని విడిచిపెట్టడు.

మాకు సహవాసాలు మంచివి కుదరటం లేదు, వారిని వదిలివేద్దామనుకొంటున్నాను అని ఒకరు కంచి పరమాచార్య దగ్గర అన్నారు. అప్పుడు పరమాచార్య ఒకమాట చెప్పారు. నువ్వు ఎవరినైతే విడిచిపెట్టేయాలనుకొంటున్నావో వారు నీ కుటుంబసభ్యులు అనుకో వారిని కూడా విడిచిపెట్టేస్తావా అన్నారు. ఇటువంటి మాట నేను శాస్త్రంలో కూడా చదువలేదు. నీ కుటుంబ సభ్యులు మంచివారు కాదు అనుకో వారిని మంచివారుగా చేయటానికి ప్రయత్నం చేస్తావు కదా అలాగే సాధ్యమైనంత వరకు వారిని కూడా బాగుచేయటానికి ప్రయత్నం చెయ్యి అంతేగాని సడన్‌గా వారిని విడిచిపెట్టేయకు. మీకు దేహాత్మబుద్ధి నశించకపోతే కోటి జన్మలు ఎత్తినా దుఃఖం మిమ్మల్ని విడిచిపెట్టదు. అందుచేత గురువు ఏమి చేస్తాడు అంటే శేషం లేకుండా దేహాత్మబుద్ధి నశించేవరకూ చూసుకొంటాడు. విషయాలలో ఉన్న నిస్సారతను నీకు చూపిస్తాడు, నీకు వివేకం ఇస్తాడు, బుద్ధిబలం ఇస్తాడు. ఇవి అన్నీ చేస్తూ నీ మనస్సుకు అంతర్‌దృష్టి కలుగజేస్తాడు. బయటగురువు నిన్ను విషయాలలో నుండి మళ్లిస్తూ ఉంటే, లోపలగురువు నిన్ను ఆత్మలోనికి గుంజుకొంటాడు. మొత్తం సృష్టి అంతా ఏ హృదయంలో నుండి అయితే వస్తోందో అక్కడకు నిన్ను నెట్టుకొనిపోతాడు, వాడు గురువు. ఏది జ్ఞానమో మీకు తెలియకపోయినా గురువుకు తెలుస్తూ ఉంటుంది, అజ్ఞానంలో నుండి మిమ్మల్ని ఎలా విడదీయాలో గురువుకు తెలుస్తుంది. ఆ విడదీసేటప్పుడు మిమ్మల్ని నెమ్మదిగా ప్రిపేర్ చేసి

అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి నెట్టుకొనిపోతాడు. నీకు గురువుతో మానసిక అనుబంధం ఉంటే, గురువు మాటయందు విశ్వాసం ఉంటే, మనం ఏదిగా ఉన్నామో అదే గురువు అని పూర్ణమైన అవగాహన నీకు ఉంటే మీరు అమెరికాలో ఉన్నా, ఇంగ్లాండులో ఉన్నా గురువు చేసే పని చేసుకుపోతాడు, మీరు ఏ జన్మకాజన్మ దేహం చుట్టూ, మనస్సు చుట్టూ తిరుగుతూ ఉంటారు అనుకోండి, ప్రపంచంలో ఏదో సంఘటన మిమ్మల్ని బంధించకుండా ఉండదు, పీడించకుండా ఉండదు. ఆత్మచింతన తప్పించి, దైవచింతన తప్పించి ఏ విషయం మీరు ఆలోచించినా, ఏది చింతించినా ఏ నాటికైనా మీకు మిగిలేది దుఃఖం, మిగిలేది విషాదం. అందుచేత గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే మీ దేహ యాత్రకు సరిపడే పనులు చేసుకొంటూ మిగతా టైము అంతా బ్రహ్మజ్ఞానం సంపాదించు కోవటానికి ప్రయత్నం చేసుకోండి, కాలాన్ని పాడుచేసుకోవద్దు అని రిపీటెడ్‌గా పరమాత్మ చెప్పాడు. ఎక్కడైతే శరీరం ఉందో అక్కడ మనం ఉండము, ఎక్కడైతే మనస్సు ఉందో అక్కడ మనం ఉంటాము. గురువుతో మానసిక అనుబంధం వలన ప్రాపంచిక విషయాలతో సంబంధం మీకు తెలియకుండా రాలిపోతుంది. సజ్జనసాంగత్యం వలన లోకవాసన, దేహ వాసన తగ్గిపోతాయి. మీరు ఏదైతే అవునో దానిని చింతిస్తూ ఉంటే మీరు కానిదానిలో నుండి సహజంగానే బయటకు వచ్చేస్తారు. మనం అవసరం లేని గొడవలు మాట్లాడుతున్నాము అనుకోండి భగవాన్ ఒకటే అనేవారు అవిఅన్నీ నిన్ను ఎవరు ఆలోచించమని చెప్పారు, అది మాయ అని కూడా నీకు తెలియటం లేదు. మీ వాసన మీ చేత అలా చేయిస్తుంది, అందులో నుండి బయట పడటానికి ప్రయత్నం చేయండి. కేవలం మీ తెలివితేటల వలన అందులో నుండి బయటపడలేరు, స్వప్రయత్నం, కాలపరిపక్వం, గురు కటాక్షం అవసరం. మీరు ఆ వాసనలో నుండి బయటపడటానికి ప్రయత్నం చేసేటప్పుడు అది ఎంత లోతులలో ఉందో, ఎంత బలంగా ఉందో తెలుస్తుంది కాని ప్రయత్నం లేకపోతే తెలియదు, ఏదో ఊదెయ్యొచ్చు అనుకొంటాము. వాసనాక్షయం అవ్వకుండా పునర్జన్మలు ఆగవు. మా మనస్సులో ఆ గొడవలు ఉన్నాయి, ఈ గొడవలు ఉన్నాయి అని భగవాన్‌తో ఎవరైనా అంటే, ఇల్లు శుభ్రంగా తుడిచి అందులో చీమలు ఎన్ని ఉన్నాయి అని లెక్క పెట్టుకోవటం ఎందుకయ్యా, చెత్తతో పాటు ఆ చీమలను కూడా పెంట మీద పడేస్తారు కదా ఇంక వాటి గొడవ ఎందుకు? అలాగే మీ మనస్సులో మంచిగొడవలు ఉన్నాయి, చెడ్డ గొడవలు ఉన్నాయి. అసలు మనస్సే మీరు కాదని చెప్పినప్పుడు ఆ మనస్సులో ఎన్ని గొడవలు ఉంటే మీకు ఎందుకు? ఆ క్లూ మనకు అర్థం అవ్వాలి. అది తెలిస్తే మనస్సు సడన్‌గా పడిపోతుంది. భగవాన్ దగ్గర హాలులో ఒక భక్తుడు

గోడకు ఆనుకొని నిద్రపోతున్నాడు. స్వామి, స్వామి వాడు నిద్రపోతున్నాడు అన్నాడు ఒక భక్తుడు. వాడు నిద్రపోతూ ఉంటే వాడి గొడవ నీకు ఎందుకులే అన్నాడు ఇంకో భక్తుడు. భగవాన్ ఏమన్నారు అంటే వాడిని అలా అనకు, వాడు హాలులో ఎవరు నిద్రపోతున్నారో చూడటానికి వచ్చాడేమో, వాడి పని వాడు చూసుకొంటున్నాడు అన్నారు. ఇదే మాయ. భగవాన్ దగ్గరకు ఎందుకు వచ్చాడో ఆ పని చూసుకొని వెళ్ళిపోవాలి, వాడు నిద్రపోతే ఆ గొడవ వీడికి ఎందుకు? గురువు సహవాసం వలన, గురువు సమక్షంలో మనకు జ్ఞానం సంపాదించుకోవాలి అనే బుద్ధి లోపల కలుగుతుంది, ఆ జిజ్ఞాస కలుగుతుంది. ఆ కాంక్షను ఉదయింపచేసేవాడు గురువే, దానిని పొందింపచేసేవాడు గురువే, అంతా గురువే.

ఈ సృష్టి నీది కాదు, నాది కాదు, ఈశ్వరుడిది. ఆయనకు తెలియకుండా ఈ సృష్టిలో ఏదీ జరగటానికి అవకాశం లేదు. మనం మంచి జరిగితే సంతోషిస్తాము, చెడ్డ జరిగితే దుఃఖపడతాము అది పనికిరాదు అంటున్నాడు గురువు. నీకు కలిగే చెడ్డ ద్వారా నిన్ను మహోన్నత స్థితికి తీసుకొనిపోవటానికి గురువు చేస్తున్న పన్నాగం అది. అది తెలియక మనకు చెడ్డ జరిగినప్పుడు దేవుడిని పట్టుకొని తిడతాము. మీ క్షేమం కోరేవారు మీకు చెడ్డ చేయరు. ఇంక అటువంటప్పుడు దేవుడు మీకు ఎలా చెడ్డ చేస్తాడు. దాని ద్వారా మీకు కొంత గర్వభంగం చేస్తాడు. గర్వభంగం చేసి మిమ్మల్ని పాడుచెయ్యడు, జ్ఞానశిఖరాలకు మోసుకొనిపోతాడు, వాడే గురువు, వాడే ఈశ్వరుడు. మీ తెలివితో, మీ ప్రయత్నంతో, మీ జపధ్యానములతో సాధించలేనిది గురువు అనుగ్రహం వలన సాధించవచ్చు. గురువు ఒకోసారి మిమ్మల్ని తలుపు సందున నొక్కేసి మహోన్నత స్థితికి తీసుకొని పోవచ్చు, ఇది తెలిసిన వారు ధన్యులు. సంతోషం, దుఃఖం, గౌరవం, అగౌరవం ఇవన్నీ మనస్సులో గొడవలు, మనస్సు దాటితే ఏమీ లేదు. గురువు చెప్పిన మాటను అర్థం చేసుకొంటూ ఉంటే, ఆ రకంగా జీవిస్తూ ఉంటే మీ మనస్సు వెళ్ళి ఎక్కడైతే ఆనందం ఉందో ఆ హృదయగుహలో పడిపోతుంది. హృదయంలో ఉన్న వస్తువు మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు, దాని తాలుక ఆనందం, సుఖం మీకు అందినప్పుడు ఇంక మీ శరీరం చనిపోయిన ఆ సుఖప్రవాహం ఆగదు, అలా ప్రవహిస్తూనే ఉంటుంది, అది నిర్వాణ స్థితి. జ్ఞాని మనస్సు పగటి చంద్రుడు లాంటిది అని భగవాన్ చెప్పారు. పగలు చంద్రుడు ఉంటాడు గాని దాని ప్రభావం ఏమీ ఉండదు, జ్ఞాని మనస్సు కూడా అటువంటిదే. నదులలో స్నానాలు చేయుటం, యాత్రలకు వెళ్ళటం, గుడులలో పూజలు చేయుటం వలన పుణ్యాలు రావచ్చు, ఇలా చేసుకొంటూ వెళుతూ ఉంటే చిత్తశుద్ధి కలగటానికి మీకు దీర్ఘకాలం పట్టవచ్చు. గురువు అనుగ్రహం మీకు వేగంగా పనిచేస్తుంది. గురువు యొక్క మాట మీకు అర్థమవుతూ ఉంటే,

గురువుతో మీకు మానసిక అనుబంధం ఉంటే చిత్తశుద్ధి కలగటం, సిద్ధి కలగటం ఇవి సైమల్టేనియస్‌గా జరిగిపోతాయి. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. సాధ్యమైనంతవరకు ఈ జన్మలోనే ఇప్పుడే ఇక్కడే ఆ వస్తువును మీచేత పొందింపచేయటానికి ప్రయత్నం చేస్తాడు, వాడే గురువు. మీ ఇంటి దగ్గర జున్ను ఉంది అనుకోండి. మీ అమ్మాయికి జున్ను అంటే బాగా ఇష్టం అనుకోండి వెంటనే మీ అమ్మాయి జ్ఞాపకం వస్తుంది, ఇక్కడ ఉంటే జున్ను తినును కదా అనుకొంటారు. ఇది ప్రాపంచిక విషయం. గురువు చేసే పని అది కాదు. మీ అమ్మాయి మీద మీకు ఎంత ఇష్టం ఉంటుందో అంతకంటే ఎక్కువ ఇష్టం గురువుకు మీ మీద ఉంటుంది. గురువు ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని ఇప్పుడే ఇక్కడే మీచేత పొందింపచేయటానికి చూస్తాడు, వాడు సద్గురువు. గురువు నీతో మాట్లాడుతూ, నీకు సబ్జక్టు చెపుతూ, నీ మనస్సు ఏ విషయాల మీద వాలుతోందో అది కూడా చూస్తూ ఉంటాడు, ఆ ఎటాచ్‌మెంట్ తగ్గిస్తూ ఉంటాడు, నీకు ఎవరిమీద మమకారం ఉందో వారిచేత తిట్టిస్తాడు, మిమ్మల్ని హృదయంలోనికి నెట్టుకొని పోవటానికి ఇవి అన్నీ గురువు చేస్తూ ఉంటాడు. బాహ్యముఖానికి వెళ్ళే నీ మనస్సుకు అంతర్దృష్టిని కలుగజేసి, ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించేవాడు గురువు. ఆయన ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని పొందింపచేసే వరకు నిన్ను వెంటాడుతాడు, వాడు గురువు. ఒకవేళ మీ శరీరం ఈ లోపు చనిపోయింది అనుకోండి, మీ బంధువులు, స్నేహితులు విడిచిపెట్టేస్తారు, అన్నీ పోతాయి కాని గురువు మాత్రం మిమ్మల్ని విడిచిపెట్టడు, వాడే గురువు. మీలో ఒక్కరికి ఆత్మజ్ఞానం కలిగింది అనుకోండి, హృదయంలో ఉన్న వస్తువు అనుభవంలోనికి వచ్చింది అనుకోండి, మిమ్మల్ని చూసి లక్షలమంది బాగుపడతారు, దీనికి మించిన సహాయం లోకానికి చెయ్యలేరు. ఆత్మవిశ్వాసం లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. మీకు ఆత్మవిశ్వాసం లేదు అనుకోండి, మీకు ఆత్మవిశ్వాసం కలిగే సంఘటనలు కావాలనే క్రియేట్ చేస్తాడు, ఏ కుటుంబంలో పెడితే నీకు ఆత్మవిశ్వాసం కలుగుతుందో, ఎటువంటి పరిస్థితులలో పెడితే మీకు ఆత్మవిశ్వాసం కలుగుతుందో అక్కడ కూర్చోబెట్టి మీకు ఆత్మవిశ్వాసం కలుగజేసి ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. వాడు గురువు. మీకు ఎప్పుడైనా స్వప్నాలు వస్తాయా అని భగవాన్‌ను అడిగారు. వస్తే నష్టం ఏమిటి అన్నారు భగవాన్. అదేమిటి అలా అంటున్నారు అని అడిగారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే నాకు స్వప్నం వస్తుంది. స్వప్నం వచ్చినప్పుడు ఇది స్వప్నమే, ఇది నిజంకాదు అని నాకు తెలిసినప్పుడు ఎన్ని స్వప్నాలు వస్తే నాకేల అన్నారు. మనకూ స్వప్నాలు వస్తాయి, ఆ స్వప్నం వచ్చినప్పుడు అది నిజం అనుకొంటాము కాని స్వప్నం అనుకోము. బాహ్యంగా ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయి, ఎన్నో బొమ్మలు కనిపిస్తున్నాయి. మీకు ఆకర్షణ లేనప్పుడు వాటి గొడవ మీకు ఏమీ ఉండదు.

ఉన్నవాడు ఒక్కడే వాడే నారాయణుడు, వాడే పరమాత్మ. వాడే దేహం కింద, జీవుడు కింద కనిపిస్తున్నాడు. ఉన్న దానిని ఉన్నట్లుగా చూసావు అనుకో జీవుడు లేడు, పునర్జన్మలు లేవు. మీకు ఇష్టమైన సంఘటన జరిగితే ఒక రకంగా ఉంటారు, ఇష్టంలేని సంఘటన జరిగితే ఇంకో రకంగా ఉంటారు, ఇవే జీవలక్షణాలు. ఉన్నవస్తువును ఉన్నట్లుగా దర్శించారు అనుకోండి ఇవి ఏమీ మిమ్మల్ని ముట్టుకోవు. ఇష్టమైన సంఘటన అసత్యమే, ఇష్టంలేని సంఘటన కూడా అసత్యమే అది మీకు అర్థమైతే ఎన్ని సంఘటనలు జరిగితే మాత్రం వాటి గోల మీకు ఏముంటుంది? ఏమీ లేదు. నువ్వు ఆలోచించే విషయాలు ఎంత నిజమో ఆలోచించేవాడు కూడా అంతే నిజం. ఇదీ అబద్ధం, అదీ అబద్ధం అని తెలిసినప్పుడు నిన్ను బంధించేవాడు ఎవడు ఉన్నాడు. బుద్ధుడు చెప్పిన నిర్వాణస్థితి దాకా వెళ్ళనక్కరలేదు. అసలు ఈ మనస్సు అనే గెడప దాటారా మీ ఇంట్లోవారు గాని, సమాజంగాని మిమ్మల్ని ఏమీ చేయలేరు, దేని వలన మీరు హర్ట్ అవ్వరు. ఎందుచేత నంటే అక్కడ హర్ట్ అయ్యే వాడు లేడు కాబట్టి. అమృతానుభవం ప్రసాదించేవాడు ఒక్క గురువు మాత్రమే, అది గురువుకే సాధ్యం. ఎందుచేతనంటే గురువు ఆత్మ అయి ఉన్నాడు, జర్మనీలో ఒక గురువు ఉండేవాడు. ఆయనను చూడటానికి చాలామంది జనం వచ్చేవారు. ఏవండీ మా దగ్గరకు జనం ఎవరూ రావటం లేదు, మీ దగ్గరకు వచ్చి చూసి వెళుతున్నారు ఏమిటి అని ఆయనను అడిగారు. నాకు రెండు తెలుసు కాబట్టి వీరందరూ వస్తున్నారు. 1. నేను ఏమీ చెయ్యలేదన్న సంగతి నాకు తెలుసు, 2. నాకు ఏదీ రాదన్న సంగతి కూడా నాకు తెలుసు అని చెప్పారు. నేను అది సాధించాను, ఇది సాధించాను అని మనం అనుకొంటాము. పని దేహం చేస్తుంది, మనస్సు నేను చేసాను అంటుంది అంటే మనం దేహానికి, మనస్సుకు పరిమితమై ఉంటాము. లోపల ఉన్న చైతన్యానికి వీటితో సంబంధం లేదు, వారు లోపల ఉంటారు, ఏమీ చెయ్యరు, వారు ఎలా ఉన్నారో అలా ఉంటారు. నాకు అన్నీ తెలుసును అని నీ హృదయంలో ఉన్న నిజం అనుకోదు. నాకు తెలుసును అని చెప్పేది నీ బుద్ధి. నీకు బుద్ధితో తాదాత్మ్యం ఉంది కాని నీ హృదయంలో ఉన్న నిజంతో నీకు తాదాత్మ్యం లేదు. ఆయన ఈ బుద్ధిని దాటి వెళ్ళిపోయాడు కాబట్టి అందరూ చూడటానికి వెళుతున్నారు. గురువును చూడటం అంటే గురువు ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిలో ఉండటమే ఆయనను చూడటం. గురువు మాట్లాడనక్కరలేదు, వ్రాయనక్కరలేదు, ఆయన ఏ గుహలో ఉన్నా ఎక్కడ ఉన్నా ఆయన ప్రభావం మనకు కనిపిస్తూ ఉంటుంది. గురువుకు శరీరం అక్కరలేదు. వాడికి శరీరం ఉన్నప్పుడు కూడా ఆ శరీరం కాదు మిమ్మల్ని అనుగ్రహించేది, ఆయనలో ఏదైతే అనుగ్రహిస్తుందో దానికి చావులేదు.

ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రపోయేవరకు మనకు దేహం నేను, దేహం నేను అనుకోవటమే పని, ఇంకో పని ఏమీ లేదు. జపధ్యానములు లేవు, సత్సంగము లేదు, అధ్యయనం లేదు, ఏ సాధనా మనకు లేదు. దేహం నేను, దేహం అని మీరు అనుకొంటూ ఉంటే మీరు కానిదానిని మీరు అనుకొంటున్నారు కాబట్టి భవిష్యత్‌లో అన్ని రకాల బాధలు వస్తాయి. ఈ దేహం చనిపోయినా దేహమే నేను అనే బుద్ధి నీకు ఉంది కాబట్టి ఇంకో దేహంలో అనుభవిస్తావు. ఎక్కడో ఒకచోట అన్ని రకాల శిక్షలు నీవు అనుభవించవలసిందే. ఆత్మ మనమై ఉన్నాముకాని అది మనకు తెలియటం లేదు. పైగా దేహాన్ని ఆత్మ అనుకొంటున్నాము. దేహాన్ని ఆత్మ అనుకొన్నంతకాలం మనకు సుఖం తెలియదు, శాంతి రాదు. ఆ దేహాత్మబుద్ధిని ఎలా తొలగించాలో గురువు చూస్తూ ఉంటాడు, దానిని ఊడగొట్టే వరకు గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. దేహము నేను అని ఎవరు అంటున్నారు? నీ మనస్సు అనుకొంటోంది. గురువు టీచింగ్ నీ శరీరానికికాదు, నీ మనస్సుకు బోధ చేస్తున్నాడు. ఆ మనస్సును ఊడగొట్టే వరకూ టీచింగ్ జరుగుతూనే ఉంటుంది. మేము డబ్బు సంపాదించాము, మేము చాలా తెలివైనవారము, మేము గొప్పవారము అని ఇలా ఏవో బోట్లు పెట్టుకొని బతుకుతూ ఉంటాము. మనం ఇలా పాడైపోతున్నాము అని గురువు ఏమి చేస్తాడు అంటే ఏవో సంఘటనలు క్రియేట్ చేసి ఆ బోట్టు అన్నీ ఊడగొడతాడు, అప్పుడు గాని మీ మనస్సు వెళ్ళి హృదయ గుహలో పడదు. మీరు సబ్జక్టును బాగా అర్థం చేసుకోండి. గురువు మీద కోపం వచ్చి మీరు గురువును విడిచిపెట్టేసినా గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు ఎందుచేతనంటే గురువు ఆత్మ అయి ఉన్నాడు. మీకు మనస్సు ఉంది కాబట్టి మీరు విడిచిపెట్టేయవచ్చు. విడిచిపెట్టటం, పట్టుకోవటం అనేవి మనస్సుకు సంబంధించినవి. ఆత్మకు పట్టుకోవటం, విడిచిపెట్టటం అంటూ ఏమీ లేదు, అంతా తానే. మీరు మంచి విషయాలు విని ఇంటికి వెళ్ళి మననం చేసుకోవాలి, మననం చేసుకొన్నవాడు ముని అవుతాడు. ఈ మీటింగుల లక్ష్యం, రమణ భాస్కర లక్ష్యం ఒక్కటే. మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మీరు పెర్మనెంట్‌గా సుఖంలో, శాంతిలో ఉండాలి. మీ శరీరానికి మరణం రాకముందే మీరు మోక్షసుఖం పొందాలి. అదే ఈ ప్రవచనాల లక్ష్యం. అంతకంటే ఏమీ లేదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 07-08-06 సోమ | శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు, మధ్యాహ్నం గం॥ 2-00లకు |
| 14 నుండి 21-08-06 | అరుణాచలం క్యాంపు |
| 27-08-06 ఆది | చింతపర్రు |
| 01-09-06 శుక్ర | ఐ-భీమవరం |
| 02-09-06 శని | ఆకివీడు |
| 10-09-06 ఆది | గోడిపాలెం, తూ॥గో॥ జిల్లా |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# కామించేవాడు - ప్రేమించలేడు

కామం వేరు, ప్రేమ వేరు. కామ క్రియలవల్ల తాత్కాలిక సంతోషం వచ్చినా తరువాత అది వెగటుగా మారుతుంది. భగవంతునికి, భక్తునికి గల సంబంధమే ప్రేమ. పవిత్ర ప్రేమకు పరిమితులు లేవు. కామం అడుగుతుంది, ప్రేమ అడగదు. సంతానం పైనా, సంసారంపైనా, భోగవస్తువులపైన ఉన్న ప్రేమ ప్రేమకాదు. అది కామం. కామం మనస్సులో ఉన్నంతకాలం అన్ని విధములైన ఆటవస్తువులు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. జ్ఞానం కలిగితే వాటిని పట్టించుకోము. అంతవరకు ఆ వస్తువులతో సంతోషపడటం మానము. హృదయంలో అణుమాత్రం కామవికారం ఉన్నా ప్రేమ ఉదయించదు. మహోన్నత త్యాగులు తప్ప ఆ దివ్యప్రేమను అనుసరించలేరు. కోరికలు అనే మురికి చింపిరి గుడ్డను విసిరివేస్తే ఆ ప్రేమలో ప్రవేశించగలం". నీవు పవిత్ర ప్రేమను పొందాలంటే అక్కడ నీ శక్తిని గురిపెట్టు, నీ మనస్సు నశిస్తుంది. విషయ చింతనకు లోనైతే ఆత్మచింతనకు దూరమౌతావు. "భోగం" ఎంజాయ్‌మెంటు వద్దకు "యోగం" సత్యం దగ్గరకూ తీసుకొని వెళుతుంది అన్నారు శ్రీ నాన్నగారు. మన కోరికలు, ఆశలు హిమాలయ పర్వతాలు అంత ఎత్తులో ఉన్నాయి. కాని చావు మన కాళ్ల క్రిందే ఉంది. కర్మానుభవం కోసమే కొన్ని రోజులపాటు ఈ మానవ జన్మ ఇచ్చి మనలను పరమాత్మ పంపాడు. మన శ్వాస ఎప్పుడు ఆగిపోతుందో తెలియదు. ఒకవేళ ఆ కోరికలు మనకు తీరాలంటే చాలా కాలం పడుతుంది. ఇంతా చేసి ఆ కోరిక తీరినా, భవిష్యత్తులో మరెన్నో కోరికలను పోగుజేసుకోకుండా ఎలా ఉంటుంది. ఈ పని "మంటలపై కిరసనాయిలు పోయటం" లాంటిది. నిత్యం కోరికలతో పరితపిస్తూ లేడిలా పరుగెత్తే మనస్సును, గురునామంపైన, గురుపాద పంచకంపైనా, దృష్టి నిలిపితే ఈ విషవలయం నుంచి బయటపడి ప్రేమతత్త్వంలో ప్రవేశిస్తాము. ప్రేమ-ప్రేమ కోసమే అన్న విషయం మర్చిపోకూడదు. గురుప్రేమకు సరిగూతేది ఈ సృష్టిలో ఎక్కడా లేదు. దాన్ని పొందితే "ఆనందమే ఆనందాన్ని ఎంజాయ్ చేస్తుంది" అంటారు పెద్దలు. భగవంతుడు ప్రేమ స్వరూపుడు అనటం కన్నా ప్రేమే భగవంతుడు అనటం సమంజసం. కాబట్టి "కాముడు ఉన్న చోట రాముడు ఉండడని గ్రహించి, కాముడిని వదలి రాముణ్ణి పట్టుకొని 'సుఖి' అవ్వాలి".

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**

# KRISHNA MENON'S RETORT

"Those who had fought a war to keep their territories have no right to tell India what to do," said Mr. V.K.Krishna Menon when a panel member on the nationwide television programme, Meet the Press, in New York on July 15 persistently questioned him on the subject of Kashmir. He told the panel member, Mr. Robert A. Smith, not to misrepresent facts. Framing his question on Kashmir, Mr. Smith said there had been nine different UN proposals for a plebiscite in Kashmir, that all the nine had been accepted by Pakistan, but India had objected to all of them. He asked how India reconciled this position with Mr. Krishna Menon's expressed belief in people being allowed to deter-mine their own form of Government. In reply, Mr. Krishna Menon said: "We came to the UN because Pakistan had invaded Kashmir, a part of India. All we had asked for was UN good offices to have the invaders removed. Our initial complaint was that we had been invaded and that there had been a gross violation of international law." When Mr. Smith asked why India opposed a plebiscite in Kashmir, Mr. Krishna Menon replied sharply, "I object to misrepresentation of facts. Why don't you read the report of Sir Owen Dixon (U.N. representative on Kashmir in 1951) which said that Pakistan had invaded Kashmir." (Sir Owen had said in his report that he would be pre-pared to hold that the entry of the tribesmen as well as that of Pakistan into Kashmir was a violation of international law). When Mr. Smith asked, "Whose territory is it," Mr. Krishna Menon said: "There has been no plebiscite in Texas which the US fought a war to keep. Those who fought a war to keep their territories have no right to tell India what to do." (Texas, one of the American States, declared itself independent of Mexico in 1836 and was annexed by the US in 1845. The Mexican war followed). Mr. Krishna Menon said misrepresentation of facts in connection with Kashmir must be corrected.

- From "The Hindu"